శ్రీ శుకబ్రహ్మాశ్రమము గ్రంథములు

		రూ. పై
1.	గీతామకరందము	70-00
2.	GITA MAKARANDA	70-00
3.	యోగవాసిష్ఠ రత్నాకరము	60-00
4.	రామాయణ రత్నాకరము	50-00
5.	భారత రత్నాకరము	50-00
6.	భాగవత రత్నాకరము	50-00
7.	ఉపనిషద్రత్నాకరము	40-00
8.	గీతోపన్యాసములు	30-00
9.	మోక్షసాధన రహస్యము	30-00
10.	పరమార్థ కథలు	30-00
11.	బ్రహ్మచర్య విజయము	30-00
12.	అధ్యాత్మరామాయణము	15-00
13.	ఆత్మానుసంధానము	15-00
14.	బ్రహ్మానంద వైభవము	15-00
15.	భజన కీర్తనలు	15-00
16.	శ్రీవాసిష్ఠమహారామాయణము	15-00
17.	అమృత బిందువులు	15-00
18.	శ్రీమద్భగవద్గీత (స్థూలాక్షరి)	15-00
19.	శ్రీమద్భగవద్గీత (మూలం)	5-00
20.	వివేకానంద సింహనాదము	15-00
21.	యమలోక వార్తలు	4-00
22.	శ్రీ శ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాముల జీవిత చరిత్ర	20-00
23.	తత్త్వసారము	3-00
24.	మానసబోధ	3-00
25.	పాండవ గీత	3-00
26.	అధ్యాత్మ జడ్జిమెంటు	3-00
27.	ధ్యాన పద్ధతి	2-00
28.	వైరాగ్య సాధన	2-00
29.	మట్టిలో మాణిక్యము	2-00
30.	ప్రణవ పూజ	2-00
31.	గౌరీ పూజావిధానము	2-00
32.	ద్వాదశమంజరి	2-00
33.	మోక్షద్వారపాలకులు	2-00
34.	ఆత్మతత్త్వవిచారణ	2-00
35.	అధ్యాత్మ హితోక్తులు	2-00

కేసెట్లు

1.	శ్రీ స్వామివారి ఉపన్యాసము (కేసెట్ 1 అధ్యాయం)	35-00
2.	తత్త్వసారము	35-00
3.	మానసబోధ	35-00
4.	తత్త్వగీత	35-00
5	యతిగీత	35-00

శ్రీ స్వాములవారి వీడియో కేసెట్స్
ఒక కేసెట్ రూ. 140/-
మొత్తము సెట్ రూ. 2,250/-

మాసపత్రిక

వేదాంతభేరి సంవత్సర చందా	30-00
శాశ్వత చందా	300-00

గ్రంథములు కావలసిన వారు ఈ క్రింది చిరునామాకు వ్రాయవలెను.

మేనేజరు
శుకబ్రహ్మాశ్రమము
శ్రీ శుకబ్రహ్మాశ్రమము పోస్టు
శ్రీకాళహస్తి-517640, చిత్తూరుజిల్లా

శ్రీ మలయాళ మహర్షి



మహర్షి సద్గురు
శ్రీ మలయాళస్వాములవారు,
శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు.

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీకాళహస్తి

శ్రీ మలయాళ మహర్షి

(మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారి
జీవిత దిగ్దర్శనము)

రచయిత:

శ్రీ విద్యా ప్రకాశానందగిరిస్వాములవారు,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము - శ్రీ కాళహస్తి.

★

శ్రీ శుకబ్రహ్మాశ్రమము
శ్రీ కాళహస్తి

1992

మిత్రులందరికి విన్నపము మేము చేస్తున్న భక్తి ప్రచారం ఈ **WEBSIGHTS** ద్వారా చేస్తున్నాము
http://telugudevotionalswaranjali.blogspot.in
http://gitamakarandam.blogspot.in
http://sundaravignanagrandalayam.blogspot.in
http://hindudevotionalswaranjali.blogspot.in
videos Channel URL:
http://www.youtube.com/ysreddy94hyd
PDF BOOKS Channel URL:
http://www.scribd.com/ysreddy94hyd
COntact E-Mail ID:ysreddy94hyd@gmail.com
our uploade folders links:
MEDIAFIRE:
http://www.mediafire.com/?86epi81waeayl
http://www.mediafire.com/?7900suod857zc
http://www.mediafire.com/?45h5fdfw4lgzl
http://www.mediafire.com/?606gdhk35zvbc
http://www.mediafire.com/?0t92f0wb91g18
http://www.mediafire.com/?xw75pfuld2dyy
4shared.com
http://www.4shared.com/account/dir/7389418/29f7347/sharing.html
http://www.4shared.com/account/dir/17611451/d787ef46/sharing.html
http://www.4shared.com/account/dir/10277723/80937010/sharing.html
http://www.4shared.com/account/dir/8542654/5e21d7f2/sharing.html
http://www.4shared.com/account/dir/13927785/d05881/sharing.html
http://www.4shared.com/account/dir/7389329/5bfa0697/sharing.html
http://www.4shared.com/account/dir/0R3Tnd0Y/sharing.html
http://www.4shared.com/dir/F2rw-Nf_/sharing.html
http://www.4shared.com/account/dir/WNtoWpN7/sharing.html
http://www.4shared.com/account/dir/nxtsJpm4/sharing.html
http://www.4shared.com/dir/gaxNSDyA/sharing.html
http://www.4shared.com/account/dir/0R3Tnd0Y/sharing.html
http://www.4shared.com/dir/F2rw-Nf /sharing.html
http://www.4shared.com/dir/yEUzu0ce/sharing.html
http://www.4shared.com/dir/ntqVRt35/sharing.html
http://www.4shared.com/dir/aEQCr1BZ/sharing.html
please forward the above links to your friends and relatives..

మొదటి కూర్పు 2000 కాపీలు
రెండవ కూర్పు 1992 3000 కాపీలు
కాపీరైట్ రిజిష్టర్డు

ప్రతులకు :
మేనేజరు,
శ్రీ శుక బ్రహ్మాశ్రమము,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోష్టు)
కాళహస్తి - 517 640
చిత్తూరు జిల్లా (ఏ.పి.)
ఫోన్ నెం. 2239, 2543
STD/08578

ముద్రణ :
శ్రీకృష్ణచిత్ర ప్రింటర్స్
4, నాగేశ్వరన్ వీధి,
టి. నగర్ మద్రాసు-600 017.
ఫోన్ : 441286

ఓమ్

దైవ ప్రార్థన

కరుణామూర్తియగు సర్వేశ్వరా! మా చిత్తము సర్వకాల సర్వావస్థల యందును నీ పాదారవిందములందు లగ్నమై అచంచలమైన భక్తితో కూడియుండునట్లు అనుగ్రహింపుము!

పరమదయానిధీ! ప్రాతఃకాలమున నిద్రలేచినది మొదలు మరల పరుండువరకును మనోవాక్కాయములచే మా వలన ఎవరికిని అపకారము కలుగకుండునట్లును, ఇతర ప్రాణికోట్లకు ఉపకారము చేయులాగునను సద్బుద్ధిని దయచేయుము. సచ్చిదానందమూర్తీ! నిర్మలాత్మా! మా యంతఃకరణము నందు ఎన్నడును ఏ విధమైన దుష్టసంకల్పముగాని విషయ వాసనగాని, అజ్ఞానవృత్తిగాని జొరబడకుండునట్లు దయతో అనుగ్రహింపుము! వేదాంతవేద్యా! అభయస్వరూపా! మా యందు భక్తి, జ్ఞాన. వైరాగ్య బీజము లంకురించి శీఘ్రముగ ప్రవృద్ధములగునట్లు ఆశీర్వదింపుము. మఱియు ఈ జన్మమునందే కడతేరి నీ సాన్నిధ్యమున కేతెంచుటకు వలసిన శక్తిసామర్థ్యములను కరుణతో నొసంగుము. దేవా! నీవు భక్తవత్సలుడవు! దీనులపాలిటి కల్పవృక్షమవు! నీవు తప్ప నాకు ఇంకెవరు దిక్కు? నిన్ను ఆశ్రయించితిని. అసత్తునుండి సత్తువకు గొనిపొమ్ము! తపస్సునుండి జ్యోతిలోనికి తీసికొని పొమ్ము! మృత్యువునుండి అమృతత్వమును పొందింపజేయుము. ఇదే మా వినతి. అనుగ్రహింపుము. నీ దరిజేర్చుకొనుము.

పాహిమాం. పాహిమాం, పాహిమాం, పాహి॥

ఓం తత్ సత్.

ఓమ్

సనాతన ధర్మములు

(శ్రీ స్వాములవారు తరచుగా బోధించుచుండు సనాతన ధర్మము లిచట పేర్కొనబడుచున్నవి -)

1. తాను తరించి ఇతరులను తరింపజేయుటకు ప్రయత్నించుట.
2. ఇతరుల ఆత్మోన్నతికి అడ్డు పోకుండుట, సాధ్యమైనచో వారికి సహాయము చేయుట, తన ఆత్మోన్నతికి అడ్డు తగిలిన తొలగించుకొనుట.
3. అంతఃకరణములో గల వృత్తులు, సంకల్పములు, వాసనలు పూర్తిగ నశింపనిచో బ్రహ్మప్రాప్తికి అర్హత లేదని తలంచి తదను గుణములగు సాధనలచే తరించుట.
4. సర్వప్రాణి కోట్ల హృదయములలో వెలుగుచుండు ఆత్మను, తన ఆత్మను ఒక్కటిగా కనుగొనుట - అనునివి సనాతన ధర్మములై యున్నవి.

ఓం సచ్చిదానంద రూపాయ
జ్ఞాన వైరాగ్యదాయినే ।
అసఙ్గానన్ద దేవాయ
తస్మై శ్రీ గురవేనమః ।
హరిః ఓమ్ తత్ సత్.

★

శ్రీ వ్యాసాశ్రమ

గురు పరమ్పరా స్తోత్రమ్

★

ఓమ్ నారాయణం పద్మభువం వసిష్ఠం శక్తిం తాపసం ।
పరాశరఞ్చ తత్పుత్రం వ్యాసం వేదాబ్జభాస్కరమ్ ॥
ఓమ్ విరక్తం శ్రీ శుకం దేవం జ్ఞానవైరాగ్య రూపిణం ।
గౌడపాదం చ గోవిన్దం యోగీన్ద్రం జ్ఞానినాం వరమ్ ॥
ఓమ్ తచ్ఛిష్యం శఙ్కరాచార్య మద్వైత స్థాపకం గురుం ।
తచ్ఛిష్యాన్పద్మపాదాదీన్ శ్రౌతతత్త్వార్థ బోధకాన్ ॥
ఓమ్ అసఙ్గానన్దగుర్వాదీనస్మద్గురువరాన్పరాన్ ।
సమ్భిన్నాజ్ఞానతమసో వన్దే జ్ఞానప్రదాయినః ॥
ఓమ్ శ్రీనారాయణగుర్వాద్యాం శివలిఙ్గార్య మధ్యమాం ।
అసఙ్గానన్దపర్యన్తాం వన్దే గురుపరమ్పరామ్ ॥

ఇతి శ్రీ గురుపరమ్పరా స్తోత్రమ్.

★

ఓమ్.

విషయ సూచిక

		పుట
1.	ప్రస్తావన	1
2.	ఓ మనస్సా! వినుము.	2
3.	గురువందనము	3
4.	గురుమహిమ	4
5.	తీవ్రతర ముముక్షుత్వము	6
6.	అనుష్ఠాన ప్రాధాన్యత	7
7.	శ్రీ అసంగానందాష్టకము	8
8.	పుణ్య భూమి	11
9.	గురువుయొక్క ఆవశ్యకత	14
10.	శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి అవతరణము	17
11.	శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి సంక్షిప్త జీవిత చరిత్ర	18
12.	శ్రీ స్వాములవారు కావించిన ప్రజోపయోగ కార్యములు	47
13.	శ్రీస్వాములవారు తఱచు బోధించు నియమములు	48
14.	శ్రీ స్వాములవారి సన్నిధియందు నా అనుభవములు	49
15.	శ్రీవారి జీవితముద్వారా నేర్చుకొనదగిన పాఠములు	57
16.	శ్రీవారి సూక్తులు	58
17.	శ్రీ స్వాములవారి గంభీర ఘోషణము	59
18.	కొందఱి ప్రశ్నలకు శ్రీవారి సమాధానములు	60
19.	శ్రీ స్వాములవారి ఉపదేశరత్నములు	61
20.	శ్రీ స్వాములవారి ఉపమానాత్మక బోధ	70
21.	శ్రీవారి ఆదర్శ గుణగణములు	88
22.	పండిత ప్రశంస	92

ఓమ్

ప్రస్తావన

మహాత్ముల జీవితములు జనులకు ఆదర్శవంతములుగ నుండును. వారి సచ్చరిత్రలు చీకటిలో దివిటీలవలె మార్గమును చూపును. భవారణ్యమున దారి తెన్ను తెలియక కొట్టు మిట్టాడుచుండు జీవులకు మహనీయులగు సద్గురువులు దారి చూపి విముక్తిని కలుగజేయుదురు, అట్టి అనుభూతిపరులగు మహాత్ములలో శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారొకరు. వారి జీవిత విశేషములు, బోధలు మున్నగునవి ఈ గ్రంథమున పొందుపఱచబడినవి. శ్రీ వ్యాసాశ్రమమున శ్రీ సద్గురు మలయాళ స్వాములవారి సాన్నిధ్యమున పండ్రెండు సంవత్సరములు గురుకులవాసము చేసినట్టి శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు ఈ గ్రంథమును రచించిరి. శ్రీ మలయాళ యతీంద్రులవారి శతజయంతి శుభ సందర్భమున శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారి శత జయన్త్యుత్సవ సంఘం వారిచే ఈ పవిత్ర గ్రంథము ప్రకటింపబడినది. ముముక్షువు లిద్దానిని పఠించి శ్రీవారి దివ్యప్రబోధములను కార్యాన్విత మొనర్చి పరమ శాంతిని అనుభవించుదురు గాక!

ఓమ్.

ఇట్లు,

ప్రకాశకులు.

ఓ మనస్సా! వినుము

★

అనుభూతి బడసిన
సద్గురూత్తమునకై
బాగుగా వెతకుము మనసా!
గురుపాదముల జేరి
ఆత్మానుభూతికై
ధ్యానంబు సలుపుము మనసా! 1
ఋషులు పొందిన శాంతి
కలుగునా నా కని
సంశయింపకు ఓయి మనసా!
అభ్యాస వశమున
సర్వులకు మోక్షంబు
సమకూరు ధరణిలో మనసా! 2
సంసార కూపమున
దిక్కు తోచక యుండి
విలపించు టేలకో మనసా!
గురు పాదములఁ జేరి
తత్త్వంబు తెలిసికొని
తప్పించుకో ఓయి మనసా! 3

★

ఓమ్

గురువందనము

★

యస్య ప్రసాదాదహమేవ సర్వం
మయ్యేవ సర్వం పరికల్పితం చ
ఇత్థం విజానామి సదాత్మ రూపం
తస్యాంఘ్రి పద్మం ప్రణతోఽస్మి నిత్యమ్.

ఎవరియొక్క అనుగ్రహముచే 'ఈ సమస్తము నేనే. నా యందే ఈ సమస్తము కల్పింపబడి యున్నది' అని ఈ ప్రకారముగ సద్రూప ఆత్మను ఎఱుఁగుచున్నానో, అట్టి గురుదేవుల పాదపద్మములకు సదా ప్రణమిల్లుచున్నాను.

★

ఓం

గురుమహిమ

★

దృష్టాన్తో నైవ దృష్టస్త్రిభువనజఠరే
సద్గురోర్జ్ఞానదాతుః
స్పర్శశ్చేత్తత్ర కల్ప్యః స నయతి
యదహో స్వర్ణతామశ్మసారమ్
న స్పర్శత్వం తథాపి శ్రితచరణయుగే
సద్గురుః స్వీయశిష్యే
స్వీయం సామ్యం విధత్తే భవతి
నిరుపమస్తేన వాఽలౌకికోఽపి.

ఈ ముల్లోకములందును సద్గురువు వంటి జ్ఞానదాత మఱియొకడు లేనేలేడు. సద్గురువుతో పోల్చి చెప్పుటకు దృష్టాంతమెద్దియు కానవచ్చుట లేదు. ఒకవేళ సద్గురువు స్పర్శమణి (పాదరసమణి) వంటివాడని చెప్పుదమన్న అదియు సరియైనది కాదు. ఏలయనిన, స్పర్శమణి ఇనుప వస్తువులను బంగారుగ చేయగలదేకాని, తన రూపమైన

స్పర్శమణిగ మార్చలేదు. సద్గురువో అట్లుకాదు. తన పాదపద్మములను ఆశ్రయించిన శిష్యుని తనతో సమానముగ చేయగలడు. 'తత్త్వమసి' 'అహం బ్రహ్మాస్మి' మున్నగు మహావాక్యముల ప్రబోధము ద్వారా జీవుని శివునిగను, శిష్యుని గురువుగను, మానవుని మాధవునిగను చేయగలడు. కావున సద్గురువుతో పోల్చదగిన దెద్దియు ఈ ప్రపంచమున లేదు. అతడు అనుపమ సామర్థ్య సంపన్నుడు. అలౌకిక ప్రజ్ఞాధురంధరుడు. అట్టి సద్గురు దేవునకు నమస్కారము!

(సద్గురువుయొక్క మహిమ పై వాక్యములచే తేటతెల్లమగుచున్నది. కావున గురుదేవులయందు వారి వాక్యములందు పరిపూర్ణ విశ్వాసముంచి, వారు బోధించిన రీతి అనుష్ఠించి జన్మసాఫల్యత నొందవలెను.)

★

ఓమ్

తీవ్రతర ముముక్షుత్వము

★

అతీత వైరాగ్యమఖండ బోధః
కదా ను మే సిద్ధ్యతు హే దయాళో।
సమాధి యోగస్య పరస్య నిష్ఠా
సర్వేషు భూతేషు సమత్వ బుద్ధిః ॥

పరమ దయాస్వరూపులగు ఓ పరమాత్మా! అతీతమగు వైరాగ్యము, అఖండమగు బోధ, ఉత్తమమగు సమాధి యోగనిష్ఠ, సమస్త ప్రాణులయెడల సమభావము నాకెప్పుడు సిద్ధించును?

(తపస్సు ప్రారంభించు సమయమున తమ లక్ష్య సిద్ధికి సహాయపడుడని శ్రీ స్వాములవారు భగవంతుని ప్రార్థించుచుండ అప్రయత్నముగ వారి హృదయమున స్ఫురించిన శ్లోకమిది.)

★

ఓమ్

అనుష్ఠాన ప్రాధాన్యత

నానుష్ఠానాత్పరం కార్యం
త్రిషులోకేషు విద్యతే।
సత్యం సత్యం పునస్సత్య
మితి మామక భాషితమ్ ॥

అనుష్ఠానమునకు మించిన కార్యము ముల్లోకము లందును మఱేదియు లేదు. ఇది ముమ్మాటికిని నిజమని నేను చెప్పుచున్నాను.

(శ్రీ స్వాములవారు లోకమునకు చాటి చెప్పిన పరమసత్యములలో ఇది యొకటి.)

★

శ్రీ అసంగానందాష్టకమ్

★

1. అఖండతేజమండితం సుభక్తకోటి సేవితమ్।
సదా ప్రసన్నమానసం అసంగదేశికం * భజే॥

అఖండమగు ఆత్మతేజముచే భూషితులును, ఉత్తమ భక్త సముదాయముచే సేవింపబడువారును, ఎల్లప్పుడును ప్రసన్నమైన మనస్సు గలవారును, అసంగస్వభావులును (దృశ్య సంగము లేనివారును) నగు శ్రీ సద్గురువునకు నమస్కరించుచున్నాను.

2. అనన్త సౌఖ్యదాయకం విలీనదృశ్యమండలమ్।
సులబ్ధదృక్స్వరూపకం అసంగసద్గురుం భజే॥

అనంతమగు సౌఖ్యమును (ఆత్మానందమును) గలుగజేయువారును, విలీనమైన దృశ్యసమూహము గలవారును, దృక్ స్వరూపమగు పరబ్రహ్మమును లెస్సగ సాక్షాత్కరించుకొనినవారును, నిర్లిప్తులునునగు శ్రీ సద్గురువునకు ప్రణమిల్లుచున్నాను.

3. అఖర్వ శక్తిదీపకం అకుంఠితప్రభానిధిమ్।
జగత్తమః ప్రభంజకం అసంగసద్గురుం భజే॥

అఖండమగు ఆధ్యాత్మిక శక్తిచే నలరువారును, అకుంఠితమగు జ్ఞానతేజస్సునకు నిలయులును, జనుల అజ్ఞానమును

* శ్రీ స్వాములవారి సన్న్యాసదీక్షానామము శ్రీ అసంగానంద స్వాములవారు.

పూర్ణముగ ఛేదించి వైచువారును అసంగశీలురును నగు శ్రీ సద్గురువునకు వందన మాచరించుచున్నాను.

4. సమస్తలోకపావనం సుశిక్షణప్రదాయినమ్।
అనల్పదుఃఖదూరకం అసంగదేశికం భజే॥

లోకమునంతను పవిత్రమొనర్చువారును, సాధకులకు ఉత్తమ శిక్షణ గరపువారును, మహత్తరమగు సంసార దుఃఖమును తొలగించువారును, దృశ్యవర్గమునందు తగుల్గొనని వారును నగు శ్రీ సద్గురువునకు నమస్కరించుచున్నాను.

5. అశేషఛాత్రవందితం సుసాధుసేవ్యమానసమ్।
విరక్తలోకపాలకం అసంగసద్గురుం భజే॥

సమస్త భక్తకోటిచే నమస్కరింపబడువారును, ఉత్తమ సాధు పుంగవులచే సేవింపబడిన మానసము గలవారును, వైరాగ్యశీలురగు జనులకు మోక్షమార్గమును జూపి రక్షించువారును, అసంగస్వభావులును నగు శ్రీ సద్గురువునకు వందన మాచరించుచున్నాను.

6. అధీతవేదసంతతిం ముముక్షుకల్ప పాదపమ్।
అజన్మమార్గదీపకం అసంగదైవతం భజే॥

వేదములన్నిటిని బాగుగ అధ్యయనము చేసినవారును, ముముక్షువులకు కల్పవృక్షము వంటివారును, జననమరణ రహితమగు ముక్తిమార్గమును బోధించువారును, అసంగశీలురును నగు శ్రీ సద్గురుదేవునకు నమస్కరించుచున్నాను.

7. పునీతమార్గదర్శకం సునీతివృద్ధి కారకమ్ ।
అసంగ దేశికోత్తమం సదా హృది ప్రపూజయే ।

పవిత్రమగు ఆత్మమార్గమును జూపువారును, ఉత్తమ నీతిని జనులయందు వృద్ధిపఱచువారును, సుఖదుఃఖాది ద్వంద్వములందు తగుల్కొననివారును నగు శ్రీ సద్గురు వర్యుని నిరంతరము హృదయమున లెస్సగ పూజించుచున్నాను.

8. విశుద్ధతత్త్వకోవిదం దురన్త బంధ మోచకమ్ ।
అసంగ దేశికం విభుం పునః పునర్నమామ్యహమ్ ॥

విశుద్ధమగు బ్రహ్మతత్త్వమును బాగుగ నెఱిగినవారును, భయంకరమగు సంసారబంధమునుండి జనులను విడిపించువారును, అసంగశీలురును, ప్రభువు నగు శ్రీ సద్గురు దేవునకు మరల మరల ప్రణమిల్లుచున్నాను.

గుర్వష్టకమిదం పుణ్యం యః పఠేద్భక్తి సంయుతః ।
తస్య శోకభయం నాస్తి సర్వత్ర విజయీ భవేత్ ॥

పవిత్రమగు ఈ గుర్వష్టకమును ఎవడు ప్రతిదినము భక్తితోగూడి పఠించునో అట్టివానికిక దుఃఖభయముండదు, మఱియు నాతడు సమస్త కార్యములందును విజయమునే పొందును.

ఇతి శ్రీ విద్యాప్రకాశానందయతి విరచితం
శ్రీ గుర్వష్టకం సంపూర్ణమ్.

★

పుణ్యభూమి

★

భారతదేశము మహర్షులకు ఆలవాలమైన పుణ్యభూమి. పూర్వకాలమున ఎందఱో తపస్సంపన్నులు, విద్యావంతులు, అనుష్ఠానపరులు, భగవద్భక్తులు, ఇంద్రియ మనోవిజేతలు, స్వాధ్యాయనిరతులు, పరోపకారపారీణులు, పవిత్రహృదయులునగు మహనీయులీ పుణ్యభూమి యందవతరించి, ఆత్మసాక్షాత్కారమును బడసి, బ్రహ్మత్వము ననుభూతము చేసికొని తాము తరించుటయేకాక తమ యనుభూతులను లోకములో వెదజల్లుటద్వారా ఎందఱినో తరింపజేసిరి.

ఎందఱో మహనీయులు తమ నియమనిష్ఠలతో అకుంఠిత దీక్షతో తపమునలిపి, ఆధ్యాత్మిక సాధనలను గావించి, తమ దివ్యానుభూతులను భారతీయులకేకాక యావత్ప్రపంచ మానవకోటికి చక్కగ చాటిచెప్పి, అజ్ఞాన తమస్సునందు పడియున్న ప్రజానీకమునకు జ్ఞానప్రకాశమును అందించిరి. సంసారదావాగ్నియందు పరితప్తులగుచున్న జనులయొక్క తాపములను తమ ఆధ్యాత్మిక అనుభూతులను శీతలవర్షపాతముచే అంతమొందించిరి.

వసిష్ఠ, వాల్మీకి, విశ్వామిత్ర, వామదేవ, గౌతమ, అగస్త్య, భరద్వాజ, యాజ్ఞవల్క్య, వ్యాస, శుకాది ప్రాతఃస్మరణీయులైన పరమర్షులెందరో తమ అనుభవపూర్వక

విజ్ఞానబోధలచే జనుల హృదయాంతరాళములకు పరమ శాంతిని చేకూర్చి ధన్యులైరి. అట్టి ఋషి సత్తముల పాద ధూళిచే ఈ భారత దేశము పునీతమైనది. అట్టి మహనీయుల కోవకు చెందినవారే శ్రీ సద్గురు మలయాళస్వాములవారు. వారు కారణజన్ములు. భవసాగరమున మునకలిడుచున్న మానవాళి శాంతిసుఖములు బడయుటకై సద్గురువులయొక్క ఆవశ్యకత ఎంతేనికలదు.

పూర్వపుణ్య సంస్కార ప్రాభవముచే జనులు ఆధ్యాత్మ రంగమున గొప్ప సాధనల నొనరించి, ఇంద్రియములను, మనస్సును జయించి మహర్షులుగా రూపొందుదురు. హృషీకములను అనగా ఇంద్రియములను జయించినవాడే ఋషి యనబడును. బ్రహ్మమునందు నిలుకడగలిగి యుండుటవలన అట్టివారు బ్రహ్మర్షులని పేర్కొనబడు చుందురు.

బ్రహ్మర్షులగు అట్టి మహనీయులయొక్క జీవితచరిత్ర జనుల కెంతగనో ఉపకరించును. అట్టివారి మార్గదర్శకత్వము లోకమున కెంతయో ఆవశ్యకమైయున్నది,

Lives of great men all remind us
We can make our lives sublime.

అని ఒక పాశ్చాత్య కవిపుంగవుడు చెప్పినట్లు మహాత్ముల జీవితములను పఠించుటవలన జనులు తమ జీవితము

లను కూడ సంస్కరించుకొనుటకును, చక్కదిద్దుకొనుటకును, పవిత్రవంతముగ నొనర్చుకొనుటకును వీలుండును. అట్టి మహనీయులు ఏ కొలదిమంది యున్నప్పటికిని యావత్ప్రపంచము వారిచే లెస్సగ ప్రభావిత మగుచుండును.

"Let there be a dozen lion souls, souls that have touched the Infinite, that neither care for lust or wealth or fame and these are enough to shake the whole world. అని స్వామి వివేకానందులు చెప్పినట్లు 'కామ ధన కీర్తి కాంక్షలు లేనివారును ఆత్మ సాక్షాత్కారమును బడసినవారునగు ఒక పండ్రెండుమంది సింహపరాక్రమ శీలురగు మహనీయులున్నచో యావత్ప్రపంచమును ఊపివేయవచ్చును.' (దైవోన్ముఖులుగ చేయవచ్చును.) అట్టి పవిత్రాత్ములగు మహనీయులెందరో ఈ భారతభూమియందు జన్మించిరి. జీవుడు కడతేరుటకు, సంసార దుఃఖమును అంతమొందింప జేసికొనుటకు అట్టి మహాత్ములైన సద్గురువులయొక్క సాంగత్యము చాల అవసరమైయున్నది.

★

ఓం

గురువుయొక్క ఆవశ్యకత

★

"ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం -
మహాజనో యేన గతః స పన్థాః"

అనునట్లు, ధర్మముయొక్క తత్త్వము, ఆత్మయొక్క తత్త్వము హృదయ గుహయందు నిగూఢమైయున్నది. కావున అద్దానిని అనుభూతి మొనర్చుకొనిన మహనీయులు నడచిన బాటయే జనులకు బాట. వారి మాటయే జనులకు మాట. వారే సద్గురువులు. అట్టి మహనీయులైన సద్గురువుల యొక్క ఆవశ్యకత జనులకు ఎంతేని కలదు.

భవసాగరమున మునుకలిడుచు అనేక జన్మలనుండి నానా బాధలు పొందుచుండు జీవునకు గురువు నావవంటి వాడు. గురువుయొక్క సహాయముచే మనుజుడు సంసార సముద్రమును దాటి, సురక్షితముగ ఆవలితీరమును జేరి మోక్షధామమున అడుగిడి జనన మరణరూప దుఃఖమును శాశ్వతముగ పోగొట్టుకొని పరమశాంతిని బడయుచున్నాడు.

భవారణ్య ప్రవిష్టస్య దిఙ్మోహభ్రాన్త చేతసః।
యేన సందర్శితః పన్థా తస్మై శ్రీ గురవే నమః॥

'సంసారమను అరణ్యమున చిక్కుకొని దిక్కు తెలియక భ్రాన్తచిత్తుడై అనేక బాధల నొందుచుండు జీవునకు ఎవడు

దిక్కు చూపి భవారణ్యమును దాటించునో, అట్టి గురుదేవునకు నమస్కారము' — అని పెద్దలు గురువును స్తుతించుచున్నారు.

గురువే బ్రహ్మము. గురువే విష్ణువు. గురువే మహేశ్వరుడు. వెయ్యేల గురువే సాక్షాత్ పరబ్రహ్మము. అజ్ఞానమను అంధకారమును పోగొట్టువాడే గురువు. గురుత్వము కలవాడే గురువు. ఆచరించి చూపగలవాడే గురువు. గురువు సాక్షాత్ దైవస్వరూపుడు.

తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।
ఉపదేక్ష్యన్తి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః॥

అని శ్రీకృష్ణపరమాత్మ గురువుయొక్క ఆవశ్యకతను గూర్చి గీతయందు స్పష్టముగ తెలిపియున్నారు. గురుదేవునకు భక్తిపూర్వకముగ సాష్టాంగదండ ప్రణామమాచరించి, వారిని సేవించి, వినయముతో ప్రశ్నించి వారిద్వారా ఆధ్యాత్మిక రహస్యములను చక్కగ తెలిసికొనవలెనని పై శ్లోకముయొక్క అర్థము. దైవతత్త్వమును చక్కగ అనుభూతి మొనర్చుకొనిన మహనీయులు కావున వారిబోధ శిష్యునకు ఎంతయో ఆవశ్యకమైయున్నది. గురుదేవుని అనుగ్రహాతిశయముచేతను, స్వప్రయత్నముచేతను శిష్యుడు పరమార్థ పథమున త్వరితముగ పురోగమించ గలుగుచున్నాడు. మాయకు లోబడియున్న జీవునకు మాయాధీశుడైన భగవంతునియొక్కయు, మాయను దాటిన మహనీయులయొక్కయు

అనుగ్రహమెంతేని అవసరమై యున్నది. కనుకనే గురువందనము, గురుసేవ. గురుశుశ్రూష, గురుధ్యానము మున్నగు వానిని పెద్దలేర్పఱచుటకు కారణము. వారి ఆశీస్సులచే అజ్ఞానరూపమగు తెరవిచ్ఛిన్నమై పోవును. శిష్యుని మోహము అంతరించును. అతని హృదయమున ప్రకాశము ఆవిర్భవించును.

అజ్ఞానరూప-అంధకారమును పోగొట్టువాడే గురువు. గురూపకారమునకు సాటియైనది ప్రపంచమున ఏదియును లేదు. గురువు లేనిచో సంసారబంధమునుండి విముక్తులగుట మహాదుస్తరము. భీకర సంసారమునుండి విముక్తిని బడసి నిత్యనిరతిశయానందరూప మోక్షమును బడయుటకు గురువే ఏకైక శరణ్యము. యోగవాసిష్ఠ ప్రబోధమంతయు వినిన పిమ్మట దశరథమహారాజు తన సమస్తమును గురుదేవుడైన వసిష్ఠునకు సమర్పించివేసెను. అట్లే జనకుడు, శివాజీ మొదలైన వారు తమ సర్వస్వమును గురుదేవుల కర్పించివైచిరి. గురుదేవుల ఆవశ్యకతను, మహిమాతిశయమును గుర్తెఱిగి పూర్వకాలమునుండియు ఎందఱో ముముక్షువులు గురుసేవ, గురుధ్యానము, గురువాక్య పరిపాలన చేసి తరించిరి. శాంతినిబడసిరి. కృతకృత్యులైరి. అట్టి సద్గురువులలో శ్రీ మహర్షి మలయాళస్వాముల వారొకరు. ఆదర్శవంతమైనట్టి వారి పవిత్రజీవితమును గురించిన విశేషములను ఇపుడు తెలిసికొందము.

★

శ్రీ సద్గురు మలయాళస్వాములవారి అవతరణము

లోకమున ఎప్పుడెప్పుడు ధర్మము క్షీణించునో, అధర్మము, అన్యాయము, అవినీతి, అజ్ఞానము ప్రబలునో, అపుడపుడు భగవంతుడు ఏ మహాత్ముని రూపముననో అవతరించి ఆయా దోషములను తొలగించివేయును. కనుకనే సంఘమునందు, సమాజమునందు సంకుచితత్వము విచ్చలవిడిగ తాండవించుచున్న దినములలో శ్రీ సద్గురు మలయాళస్వాములవారు అవతరించి సమాజమందలి ఆ దోషములను తొలగించివైచి విశాలభావములను వ్యాపింపజేసి, ప్రజలలో నూతనోత్తేజమును కలుగజేసిరి.

శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారు శ్రీ శంకరభగవత్పాదాచార్యుల జన్మస్థలమగు కేరళదేశమున పవిత్ర యాత్రాస్థలమగు గురువాయూరు సమీపమున ఎన్గండ్యూరు అను గ్రామమునందు పార్థివనామ సంవత్సర చైత్ర శుద్ధ ఏకాదశి శుక్రవారమునకు సరియగు 29—3—1885 తేది యందు జన్మించిరి. తండ్రి కరియప్ప, తల్లి నొట్టియమ్మ. శ్రీవారి పేరు వేలప్ప. తల్లిదండ్రులు మహాభగవద్భక్తులు. సాధువర్తనులు. కరియప్పయొక్క ముగ్గురు మగ సంతానములో శ్రీ స్వాములవారు కడపటివారు. శ్రీవారి తరువాత కరియప్పకు ఒక ఆడ సంతానము కలిగెను.

★

శ్రీ సద్గురు మలయాళస్వాములవారి సంక్షిప్త జీవిత చరిత్ర

నది ఉత్తరముఖముగా ప్రవహించునపుడు ఉత్తర వాహిని అను పేరుగలిగి మహాపవిత్రముగ నెంచబడును. అట్లే శ్రీ స్వాములవారు దక్షిణదేశమగు కేరళలో జన్మించి ఉత్తరదిశగా పయనించి ఆంధ్రావనిలో అడుగుపెట్టి ఉత్తర వాహినివలె అచ్చోటునంతను పునీత మొనర్చివైచిరి. అయితే నది జడమైనది. శ్రీవారు చైతన్యజ్ఞానగంగ. ఈ జ్ఞానగంగ దక్షిణమునుండి ఉత్తరమునకు ప్రవహించి ఉత్తరవాహినియై పఱగి ఆంధ్రభూమిని విజ్ఞానసలిలములచే పరిప్లావిత మొనర్చి ప్రజలకు మోక్షరూప ఫలములను అందించి మహోపకార మొనర్చినది.

గుమ్మడితీగె ఎక్కడనో పుట్టి ఎక్కడనో ఫలించును. అట్లే శ్రీ స్వాములవారు ఎక్కడో దక్షిణదేశమున జన్మించి ఉత్తరమునకుఁ జని ఆంధ్రదేశమున తపస్సు గావించి ఆంధ్రులకు ఆ తపఃఫలమును పంచిపెట్టిరి.

బాల్యము

తల్లియగు నొట్టియమ్మ తన బిడ్డలకు చిన్ననాటినుండి చక్కటి క్రమశిక్షణను బోధించుచు సత్ప్రవర్తనను అలవాటు చేయుచుండెను. ప్రార్థనాదులను నేర్పుట ద్వారా భగవంతుని యెడల భక్తిని కలుగజేయుచుండెను. చిన్నతనమునందే జ్యోతిష్కులు వేలప్ప జాతకముచూచి 'ఈతడు ఇంటియందుండడు. సంసారిగా నుండడు. గృహమును విడిచిపెట్టి

బహుదూరముపోయి జనులచే పూజింపబడి విఖ్యాతిని బడయును' అని చెప్పిరి.

గొప్పపట్టుదలతో శ్రీవారు చిన్నపుడు విద్యను బాగుగ అభ్యసించిరి. సంస్కృతమును నేర్చుకొనిరి. చిన్నకాలమునుండియే వారికి ధ్యానమందు మిక్కుటమగు ప్రీతియుండెడిది. దైవభక్తి, సత్కర్మానుష్ఠానము బాల్యమునుండియే వారికి బాగుగ అలవడినవి. వేలప్ప తల్లిదండ్రులయెడ మిక్కిలి భక్తికలిగి యుండెను. వారు తోడిపిల్లలను సమావేశపఱచి వారిచే నామస్మరణ, భజన, ప్రార్థన చేయించుచుండిరి. ఇంటికి సమీపములోనున్న ఒక ఏకాంతకుటీరములో శ్రీవారు ధ్యాననిష్ఠులై ఉండుచుందురు. కొంతకాలమునకు శ్రీవారు పెరింగోట్కర గ్రామమునందు శ్రీ నారాయణ గురుదేవుల ప్రముఖ శిష్యులైన శ్రీ సిద్ధ శివలింగగురుస్వామిగారి ఆశ్రమమునందు చేరి గురుసేవ చేయుచు ఆశ్రమమందు పూజాది కార్యముల నొనర్చుచు గురుసాన్నిధ్యమున బ్రహ్మవిద్యను చక్కగ నభ్యసించిరి. గురుదేవులగు శ్రీ శివలింగస్వామివారు శ్రీవారికి మంత్రోపదేశము గావించిరి. మహావాక్యోపదేశము కూడ నొనర్చిరి.

తదుపరి కొంతకాలమునకు శ్రీవారు గురుదేవులయొద్ద సెలవుగైకొని తీర్థయాత్ర గావించుటకై పాదచారియై బయలుదేఱిరి. తీర్థయాత్రకై సమ్మతి నొసంగుచు గురుదేవులు 'ప్రయత్నపూర్వకముగ బ్రహ్మచర్యమును, సత్యమును, అహింసను, అపరిగ్రహమును రక్షింపుము' అని శిష్యునకు బోధించిరి.

తీర్థయాత్ర

ఇరువదియేండ్ల వయస్సు నిండకపూర్వమే శ్రీస్వాములవారు వైరాగ్యప్రేరితులై ఒకనాటి అర్ధరాత్రి ఎవరికిని తెలియకుండ ఇల్లు విడచి పశ్చిమాభిముఖులై వెడలిరి. తనకొఱకై ఎవరును చింతింపవలదనియు, ఇంటికి వచ్చిన అతిథులను అన్నపానాదులచే ఆదరించునంతవఱకు, దైవకృపచే తనకు ఆహారాదుల విషయమై ఏ కొఱతయు ఉండదనియు, తాను దైవకార్యార్థమై వెళ్ళుచున్నాననియు, ఒక ఉత్తరము వ్రాసి దానిని తన ధ్యానకుటీరమందు వదలి శ్రీవారు పయనమైపోయిరి. వారివెంటనున్న సంచిలో భగవద్గీత, కఠోపనిషత్తు, పాతంజలయోగసూత్రములు అను మూడు పుస్తకములు, జపమాల, విభూతి, నోటుపుస్తకము, పెన్సిల్ మాత్రము ఉండెను.

దినమునకు ఒకపూట మాత్రము భోజనము చేయుచు, యదృచ్ఛాలాభసంతుష్టులై, దొరికిన దానితో తృప్తిపడుచు శ్రీవారు తమ నడకను కొనసాగించుచుండిరి. మొదట కర్నాటక దేశమున ప్రవేశించి, ఉడిపిక్షేత్రము, సుబ్రహ్మణ్యము, ధర్మస్థలము, గోకర్ణక్షేత్రము మున్నగు పుణ్యస్థలములను దర్శించిరి. పిమ్మట మహారాష్ట్రదేశమున అడుగిడి పండరిపురము, నర్మదానదీతీరస్థ ఓంకారేశ్వరమందిరము, సుధామపురి, ద్వారకాపురమును దర్శించిరి.

అనంతరము పంజాబుదేశమున ప్రవేశించి అమృతసరమందలి స్వర్ణదేవాలయమును సందర్శించిరి. పిదప కాశ్మీరును

తిలకించి హరిద్వారమున కభిముఖముగ ప్రయాణించి యమునాప్రాంతమందలి మథుర, బృందావనము, గోకులము మొదలగు పుణ్యప్రదేశములను దర్శించుటకు బయలుదేరిరి. త్రోవలో ఒక పెద్దనది దాటవలసి వచ్చెను. నావికుల కిచ్చుటకు వారియొద్ద డబ్బులేదు. ముందుకు పెట్టిన అడుగును వెనుకకు వేయరాదను నిశ్చయము కలవారగుటచే శ్రీవారపుడు ఎట్లైనను ఆవలియొడ్డున గల బృందావనమును చేరదలంచినవారై ఆ నదిలో దూకి ఈతకొట్టుకొనుచు పోయి ఆవలియొడ్డునగల బృందావనమును చేరి అచట జరుగుచుండిన ఉత్సవమునందు పాల్గొనిరి.

పిదప బృందావనము నుండి కురుక్షేత్రము, హరిద్వారము, హృషీకేశము, బదరికాశ్రమము, నైమిశారణ్యము, అయోధ్య, కాశీ మున్నగు క్షేత్రములను సందర్శించిరి. కాశీపట్టణమున అపుడు చాతుర్మాస్యవ్రతకాలమగుటచే నాలుగునెలలు ఉండిరి. అనంతరము గయాక్షేత్రము, నవద్వీపము, కలకత్తా యందలి కాళికాదేవాలయము పూరీ జగన్నాథములను దర్శించిరి. ఆ పిమ్మట ఆంధ్రదేశమునందు అడుగుపెట్టిరి. ఆంధ్రభూమి యందలి సింహాచలము, భద్రాచలము, శ్రీశైలము అను పుణ్యస్థలములను సందర్శించి అనంతరము శ్రీ వేంకటేశ్వరుల దర్శనార్థమై తిరుపతికివచ్చిరి. తిరుమల క్షేత్రమున శ్రీ వేంకటరమణుని దర్శించి పాపనాశము, ఆకాశగంగ మున్నగు తీర్థములను సేవించి తదుపరి

పంచపాండవులు తపస్సు చేసిన ప్రదేశమని వినుతికెక్కిన గోగర్భ క్షేత్రమునకు వెళ్ళిరి. గోగర్భ ప్రాంతమందలి ప్రశాంత వాతావరణము, తపస్సునకు చాల అనుకూలముగ నున్నదని నిశ్చయించి శ్రీవారు భావికాలమున తపంబు సలుపుటకు అచ్చోటునే స్థిరపరచుకొనిరి.

అటుతరువాత శ్రీ స్వాములవారు అరుణాచలము, కాంచీపురము, చిదంబరము, శ్రీరంగము, పళని మొదలగు దివ్యక్షేత్రములను సందర్శించిరి. త్రివేణి నుండి వ్రతదీక్షతో తెచ్చిన గంగాజలములోని కొంతభాగముతో పళని యందలి సుబ్రహ్మణ్యస్వామికి అభిషేక మొనర్చి, శ్రీవారు పిమ్మట మధుర, రామేశ్వరములకు వెళ్ళిరి. శేషించిన గంగాజలముతో రామేశ్వరుని అభిషేకించిరి. అనంతరము కన్యాకుమారి, అనంతశయనము, వరకల క్షేత్రములను సందర్శించి వరకలయందు గల శ్రీ నారాయణ గురుదేవులకు ప్రణమిల్లి, అటనుండి గురుదేవులగు శ్రీసిద్ధ శివలింగస్వామివారిని దర్శించి వారి అనుజ్ఞ బడసి స్వగృహమున కేగిరి. అట తండ్రి మరణవార్త తెలిసికొని భర్తృవియోగ దుఃఖముచేతను, పుత్రుని గృహత్యాగముచేతను కృశించియుండిన మాతృదేవి పాదములకు ప్రణమిల్లి శ్రీవారు కొంతకాల మింటియొద్దనే మాతృసేవ, సద్గ్రంథపఠనము, దైవధ్యానము ఒనర్చుకొనుచు తదుపరి ఏకాంతప్రదేశమున తపోనిష్ఠ గావింపదలంచినవారై తమ ఇరువది తొమ్మిదవ యేట శ్రీవారు గృహమును త్యజించి తిరుమల గోగర్భ క్షేత్రమునకు పయనమైపోయిరి. మార్గ

మధ్యమున తిరువళ్ళూరు, ఘటికాచలము, తిరుత్తణి, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రములను దర్శించి తిరుమల చేరి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని సందర్శించి పవిత్ర గోగర్భతీర్థ ప్రదేశమును చేరిరి.

సాధన

పరమ వైరాగ్యోపేతులై శ్రీ స్వాములవారు అకుంఠిత దీక్షతో, అసామాన్యనిష్ఠతో స్వారాజ్యసిద్ధికై గోగర్భమున తీవ్ర తపస్సును ప్రారంభించిరి. ఒకానొకప్పుడు గోగర్భ తీర్థమున యాత్రికులు వదలిపెట్టి వెళ్ళిన పిండములలోని పచ్చి పిండిని తిని కొన్నాళ్ళు ఆకలి తీర్చుకొనిరి. కొన్ని దినములు ఆహారమేమియు లేకనే గడచిపోయినవి. ఒకపుడు వర్షాకాలమున గోగర్భము చెంతనున్న కాలువ నిండుగ ప్రవహించుచుండుటచే మూడు రోజులు కాలువ దాటుటకు సాధ్యపడనందున శ్రీవారు ఆ మూడు రోజులు ఆహారము లేమి మిక్కుటమగు ఆకలి బాధచే పీడింపబడగా అప్పుడు వారు శివానందలహరి యందలి "స్మృతౌ శాస్త్రే వైద్యే" – అను శ్లోకము వచించి భగవంతుని నిండు భక్తితో ప్రార్థించిరి.

స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితాగాన ఫణితౌ
పురాణే మన్త్రే వా స్తుతినటన హాస్యేష్వ చతురః ।
కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోఽహం పశుపతే
పశుం మాం సర్వజ్ఞ ప్రథితకృపయా పాలయ విభో ॥

'ప్రభూ! దేవా! స్మృతులయందుగాని, శాస్త్రములందుగాని, వైద్యమందుగాని, శకునఫలము చెప్పుటయందుగాని, కవిత్వమందుగాని, గానము మున్నగు వానియందుగాని, పురాణములందుగాని, మంత్రములందుగాని స్తుతులందుగాని, నటనయందుగాని, హాస్యమునందుగాని నాకు నేర్పరితనములేదు. నాయందు రాజునకు ప్రీతి యెట్లు కలుగును? నేనెవడను? సర్వజ్ఞా! పశుపతీ! పశుతుల్యుడనగు నన్ను పరమదయతో రక్షింపుడు!'

అత్తఱి తిరుపతి దేవస్థానముయొక్క ఒక అధికారికి శ్రీ వేంకటేశ్వరులు స్వప్నములో కనిపించి 'నా భక్తుడు ఫలానచోట ఆకలి బాధతో కూడియున్నారు. వెంటనే వెళ్ళి వారికి అన్నము పెట్టుము' అని ఆదేశించిరి. ఆతడు తత్క్షణమే లేచి అన్నాదులను మూటకట్టుకొని వెళ్ళి గోగర్భమున నీటికి ఆవలివైపుననున్న శ్రీవారికి ఒక వెదురుగడ ద్వారా అన్నాదిని అందజేసెను. కరుణామయుడగు భగవంతుడు భక్తులను కాపాడుచుండును గదా!

కొంతకాలము శ్రీ స్వాములవారు తుంబురు తీర్థమందు సనకసనందన తీర్థమందు, కుమారధారా తీర్థమందు, రామకృష్ణ తీర్థమందు, శ్రీ వైకుంఠ తీర్థమందు కూడ ధ్యానాదులను నిర్వహించిరి. తుంబురు తీర్థమున తపస్సు చేయునపుడు ఒకనాడచటికి ఒక పెద్ద పులి వచ్చెను. అపుడు శ్రీవారు 'దేవా! పరమాత్మా! మీరే ఈ పులి రూపమున ప్రత్యక్షమైతిరా!' అని దైవమును స్మరించిరి. అంతట ఆ పులి ఏ విధమైన హానియు చేయక వెడలిపోయెను.

శ్రీవారు గోగర్భమున తపస్సు చేయు కాలముననే శుష్క వేదాంత తమో భాస్కరమను అనుభవపూర్వకమైన గొప్ప ఆధ్యాత్మిక గ్రంథమును రచించిరి. దానిలో కొంద అవలంబించు దురాచారములను, దుర్వాదములను ఖండించి శాస్త్రోక్తములైన సత్య సిద్ధాంతములను శ్రీవారు ప్రతిపాదించిరి. ఆ గ్రంథము ద్వారా శ్రీ స్వాములవారు ఆధ్యాత్మికరంగమున, సాంఘికరంగమున గొప్ప విప్లవమును తీసికొని వచ్చిరి. బ్రహ్మవిద్య, అనుష్ఠానము, తపస్సు, మంత్రజపము మొదలైనవి జాతి, కుల, మత భేదములు లేక సర్వులును ఆచరించి తరించవచ్చునని శ్రీవారు ఆ గ్రంథమునందు గంభీరముగ ఉద్ఘాటించిరి.

ఎన్నియో కష్టముల నెదుర్కొని, శ్రమలకోర్చి, నియమ నిష్ఠలతో తమ ధ్యానాద్యనుష్ఠానములను శ్రీవారు పట్టుదలతో కొనసాగించుచుండిరి. ప్రణవాది దివ్య మంత్ర జపము, భగవద్ధ్యానము, మహావాక్య విచారణ మొదలైన ఆధ్యాత్మిక సాధనలను పరిపూర్ణ శ్రద్ధతో, విశ్వాసముతో జరుపుచుండిరి. పూర్వకాలపు ఋషులు ఏ ప్రకారము ఏకాంతమున తపోధ్యానాద్యనుష్ఠానములను జరిపిరో అట్లే శ్రీవారును పరమ వైరాగ్యోపేతులై, అకుంఠిత దీక్షతో తమ సాధనలను కొనసాగించుచుండిరి. కొంతకాలమునకు

చిత్తమునకు శాంతికలిగి వృత్తులన్నియు నశించి మహావాక్యార్థమునందు నిలుకడ కుదిరెను. అత్తఱి నిశ్శేష శోక శాంతియు, నిరతిశయానంద ప్రాప్తియు వారికి కలిగెను. ధ్యాతృ ధ్యాన ధ్యేయములు ఏకమై అంతయు ద్వైతాకారముగ పరిణమించెను. అట్టి మహోన్నత స్థితియందు వారికి కలిగిన ఆనందము వర్ణనాతీతము. వారి తపోదీక్ష ఫలించెను. స్వస్వరూప స్థితియందు నిరతిశయ సుఖము వారికి లభించెను. కృతార్థుడనైతినని అత్తఱివారు భావించిరి. 'స్వయం తీర్త్వా పరాంస్తారయతి' అనునట్లు మహనీయులు తాము తరించి ఇతరులను తరింపజేయుదురు కావున ఇక శ్రీవారు తాము పొందిన ఆత్మజ్ఞానామృతమును ఇతరులకు కూడ పంచిపెట్ట దలంచిరి.

ఆశ్రమ స్థాపన.

శ్రీ స్వాములవారు గోగర్భమునందు దాదాపు పండ్రెండు సంవత్సరములు తపం బాచరించిరి. శ్రీవారి తపః ప్రభావము నలుదెసల వ్యాపించదొడగెను. శ్రీవారిని దర్శించుటకు వచ్చు భక్తుల సంఖ్య నానాటికి పెరుగజొచ్చెను. 'మాటలాడే వేంకటేశ్వరులు' అని జనులు శ్రీవారిని ప్రస్తుతింపదొడగిరి. శ్రీవారు తాము తలపెట్టిన ప్రజోపయోగ కార్యక్రమములైన ఆశ్రమ నిర్మాణము, సంస్కృత విద్యాలయస్థాపన మున్నగు వానికి అనువైన స్థలమేదియని పరిశీలించుచు తుదకు శ్రీకాళహస్తి తాలూకా ఏర్పేడు

గ్రామ సమీపమున నందిపర్వత పాదతలమున కాశీ బుగ్గ పుణ్యక్షేత్రము అనుకూలముగా నున్నదని నిశ్చయించి తిరుమల గోగర్భమునుండి దిగివచ్చి అచ్చోట 1936 వ సంవత్సరమున శ్రీ వ్యాసాశ్రమము అనుపేరుతో ఒక చక్కని ఆశ్రమమును స్థాపించిరి.

శ్రమను పోగొట్టి, సంసార తాపమును చల్లార్చి జీవులకు శాంతిని ఒనగూర్చునదే ఆశ్రమము. అజ్ఞాన తమస్సునందు పడి జీవితమును నిరర్థక మొనర్చుకొను వారిని మేలుకొలిపి జ్ఞాన ప్రకాశమును అందజేయునదే ఆశ్రమము. జనన మరణ రూపమైన కాల ప్రవాహమున తగుల్కొని దేహ భ్రాంతిచే సతమతమగుచు నానాయాతనల నొందుచుండు ప్రాణికోట్లకు ఆత్మజ్ఞానామృత మొసంగి ఉపశాంతిని కలుగజేయునదే ఆశ్రమము. 'నీవు దేహము కాదు, చిన్మయ స్వరూపమైన పరమాత్మవే' అని గంభీరముగ బోధ సలుపు మహనీయుల ఆవాసస్థలమే ఆశ్రమము.

అట్టి ఆశ్రమములలో శిరోమణియై వెలయుచు ఆంధ్రావని యొక్క మూర్తీభవించిన పుణ్యమా అని తోపట్టుచు శ్రీ వ్యాసమహర్షి యొక్క పవిత్ర నామధేయముతో అలరుచు నందిపర్వత పాదతలమున, నందిపర్వత, కాశీబుగ్గ, జవాల, కూర్మ, శక్త్యాది సప్తతీర్థ పుణ్యస్థలమున, పౌరాణిక ప్రసిద్ధిగాంచిన కాశీబుగ్గ క్షేత్రమందు, ఉత్తరేశ్వర స్వామివారి సాన్నిధ్యమందు శ్రీ వ్యాసాశ్రమము అధ్యాత్మ

క్షేత్రముగ విరాజిల్లుచు నవనవ దివ్యకాంతులను విరజిమ్ముచు శోభాయమానముగ వెలుగొందుచున్నది. సాక్షాత్ భగవత్స్వరూపులే యగు శ్రీ వ్యాస మునీంద్రుల పేరుతో ఆ ఆశ్రమము వ్యవహరింపబడుట ఒక గొప్ప విశేషము. అపర వ్యాసులని ప్రఖ్యాతిగాంచిన శ్రీ సద్గురు మలయాళస్వాములవారే ఆ యాశ్రమ స్థాపకులు. వివిధ పరోపకార సంస్థలతో తులతూగుచు అన్నదానము, విద్యాదానము, జ్ఞానదానము మొదలైన పుణ్యకార్యములను విరివిగ నొనర్చుచు ఆ యాశ్రమము శ్రీ స్వాములవారి నేతృత్వమున ఎంతయో అభివృద్ధిని గాంచినది.

ఆ ఆశ్రమమున భక్తులు, సాధకులు నివసించుటకై కొన్ని కట్టడములు నిర్మింపబడెను. బ్రహ్మజ్ఞానము యొక్క ప్రచారము నిమిత్తము 'యథార్థ భారతి' అను ఆధ్యాత్మిక మాసపత్రిక ఒకటి ప్రారంభింపబడెను. శ్రీ సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభ అను పేరుతో సంవత్సరమున కొకచోట గొప్పసభ జరుపబడుచుండెను. ఆ సమావేశమందు అనేక వేలమంది భక్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు చేరి పెక్కు ఆధ్యాత్మిక కార్యక్రమములందు పాల్గొనుచుందురు. శ్రీ వ్యాసాశ్రమమందు సంస్కృత భాషాధ్యయనమునకై ఒక పాఠశాలను కూడ శ్రీవారు స్థాపించిరి. జిజ్ఞాసువులకు బ్రహ్మవిద్యను బోధించుటకై బ్రహ్మవిద్యా పాఠశాలను ఏర్పఱచిరి. మఱియు స్త్రీ జనాభ్యుదయమునకై స్త్రీ విద్యా

వ్యాప్తి కొఱకై 'కన్యాగురుకులము' అను పాఠశాలను కూడ ప్రారంభించిరి.

శ్రీ స్వాములవారు తాము గోగర్భమునందు తపస్సు చేయునపుడు, చిన్నకాలమున గురుకుల వాసము చేసినపుడు, తీర్థయాత్ర సలుపునపుడు సంపాదించిన అమూల్య జ్ఞాన సంపదను, పారమార్థిక అనుభూతిని జనులకు తెలుపుట కొఱకై అనేక గ్రంథములను రచించిరి, యోగవాసిష్ఠాది అనేక గ్రంథములను తెలుగు భాషలోనికి అనువదింపజేసిరి. వారు వ్రాసిన శుష్కవేదాంత తమోభాస్కరము, స్వబోధ సుధాకరము, ప్రశ్నోత్తర మాణిక్యమాల మున్నగు అమూల్యగ్రంథములు ఆధ్యాత్మికముగ, సాంఘికముగ ప్రజలలో గొప్ప విప్లవమును తీసికొని వచ్చినవి. వానిని పఠించి ఎందఱో భగవద్భక్తి సంయుతులు, సన్మార్గగాములు అయిరి. శ్రీవారి అమూల్య బోధలచే ఎందఱో తమ హృదయములను సంస్కరించుకొనిరి.

సన్న్యాస దీక్ష.

ఆత్మసన్న్యాసమునకే శ్రీ స్వాములవారు ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చువారైనప్పటికి సన్న్యాస సంప్రదాయమును కాపాడినచో తత్ఫలితముగ అనేకమంది విద్యార్థులు ఉత్తర భారతమున సంస్కృతమున ఉన్నతవిద్య నభ్యసించుటకు అనుకూలముగ నుండునని తలంచి శ్రీవారు 2—2—1956

తేది కాశీ మండలేశ్వరులగు శ్రీ శంకరానంద యతీంద్రుల ద్వారా తురీయాశ్రమమును (సన్న్యాసమును) స్వీకరించిరి. 'అసంగానందగిరి' అను నామకరణము వారికి గావింపబడెను.

శ్రీ స్వాములవారు జనులకు ఆధ్యాత్మిక ప్రబోధము గావించుట కొఱకై, బ్రహ్మవిద్యా వ్యాప్తికొఱకై కేవలము సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభలే కాక, చాతుర్మాస్యములు, ఓంకారసత్రయాగములు మున్నగునవి కూడ అచటచట నిర్వహించిరి. వీనియన్నిటి ద్వారా, మఱియు గ్రంథముల ద్వారా, ఆశ్రమమందలి ప్రబోధము, క్రమశిక్షణ మొదలగు వానిద్వారా ఎందఱో ముముక్షువులు బ్రహ్మజ్ఞాన సంపన్నులై శాంతిని, ఆనందమును బడసి ధన్యులైరి. అట్టి సద్గురువుల అడుగుజాడలలో నడచుచు, వారి అనుభవ పూర్వక ప్రబోధములను కార్యాన్విత మొనర్చుచు ముముక్షువులెందఱో పరమశాంతిని, ఆనందమును బడసిరి.

శ్రీవారు తమ ధ్యానాద్యనుష్ఠానములను జీవితాంతము వఱకు శీలించుచునే యుండిరి. నియమిత కాలములో నియమితాహారము తప్ప మధ్యలో మఱేదియు వారు భుజించరు. చిన్ననాటి నుండి జీవితము చివరివఱకు జీవితాంతము వఱకు వారు ఏకాదశీవ్రతమును నియమపూర్వకముగ ఆచరించుచునే యుండిరి. ఈ ప్రకారముగ డెబ్బది యెనిమిదేండ్ల పవిత్ర జీవితమును గడిపి తుదకు 12—7—1962 తేది యందు శయనైకాదశీ పుణ్యదివసమున శ్రీ స్వాములవారు

తమ భౌతిక దేహమును వీడి బ్రహ్మైక్యమును బొందిరి. ఏ మహోన్నత లక్ష్యములను వారభిలషించిరో వాని నన్నిటిని తమ జీవితకాలముననే శ్రీవారు సాధించి, సంతుష్టిని బడసిరి.

శ్రీ స్వాములవారివంటి అనుభూతిపరులైన సద్గురువులు లభించుట చాల అరుదు.

సద్గురువు.

శిష్యులను సద్వస్తువగు ఆత్మయొద్దకు చేర్చువాడే సద్గురువు. సచ్ఛీలమును వాక్కునందే గాక అనుష్ఠానమునందును దిగ్దర్శన మొనర్చువాడే సద్గురువు. శిష్యుల అజ్ఞానాంధకారమును రూపుమాపి జ్ఞానాలోకమును వారికి ప్రసాదించువాడే సద్గురువు. కావున అట్టి యోగ్యతలు గలవారు సహజముగనే జనులలో చాల అరుదుగా నుందురు. భగవానుడు ఎన్నుకొనిన ఏ కొలదిమంది మహనీయులో అట్టి సద్గురుపీఠ మలంకరించి లోకములో విరాజిల్లుచుందురు. అట్టి వారిలో నొకరు శ్రీ సద్గురు మహర్షి మలయాళస్వాములవారు.

వారు జీవించిన డెబ్బది యెనిమిది వసంతములు వాస్తవముగ ప్రజలకు వసంత సదృశములుగనే యుండినవి. ఆధ్యాత్మిక విషయములందు పండిన యనుభవముగల మహనీయులగుటవలనను, పారమార్థిక సూత్రములన్నియు వారికి కాచి వడబోసినవే అయియుండుట వలనను, భక్తులకు వారి సాన్నిధ్యమందు నిగూఢ దైవతత్త్వావగాహనము సులభతర

మనిపించుచుండెడిది. బ్రహ్మజ్ఞానము పుస్తకమునుండి గ్రహింపదగిన విద్యకాదు. హృదయమునుండి హృదయమునకు ప్రవహించవలసిన అనుభవమది. బ్రహ్మానుభూతి నొంది సద్గురుని హృదయక్షేత్రమునుండి పొంగి పొరలి అధికారియగు సచ్ఛిష్యుని హృదయసీమయందు దొరలునట్టిదియే బ్రహ్మజ్ఞానము. కావున నిర్మలచరిత్ర ద్వారా తమ తమ హృదయస్థానములను పునీత మొనర్చుకొనిన భక్తకోటి యంతయు అట్టి మహాత్ములు వర్షించు బ్రహ్మజ్ఞానామృతమును గ్రహించి, అనుష్ఠించి, అనుభూత మొనర్చుకొని, జన్మసార్థక మొనర్చుకొనిరి, ఒనర్చుకొనుచున్నారు కూడాను. మహాత్ముల దివ్యావతరణముచే గలుగు పరమలాభ మిదియే.

శ్రీవారు తమ జీవితకాలమంతను అనుష్ఠానమును గూర్చియే ఎక్కువగ నొక్కి చెప్పుచుండెడివారు. వారు స్వతః అట్లాచరించిరి. గనుకనే ఆ యనుష్ఠానముపై వారికంత నమ్మకము ఏర్పడినది. (1) గురువు. (2) దైవము (3) అనుష్ఠానము అను మూడింటిని ఏ కాలమందును విస్మరించరాదనియు, అట్లు విస్మరించనందువలననే తనకెంతయో శాంతి జీవితమునందు లభించినదనియు వారపుడపుడు చెప్పుచుండెడివారు. కావున శ్రీవారి జీవితమునుండి మొట్టమొదట గ్రహింపదగిన మహాపాఠమిదియే – 'అనుష్ఠానము నెన్నడును మఱువరాదు.' ప్రతిదినమున్ను ప్రతివారును నియమపూర్వకముగ భోజన మెట్లాచరించుచున్నారో, అట్లే దైవధ్యాన

మున్ను నియమ పూర్వకముగ చేయవలయుననుట వారి బోధలలో ప్రముఖమైనది. ఈ నియమము సక్రమముగ నాచరింపబడుచో అదియే సాధకుని మెల్ల మెల్లగ మహోన్నత ఆధ్యాత్మిక శిఖరములకు గొనిపోగలదని వారి విశ్వాసము.

ప్రతి ప్రాణియందును గొప్ప గొప్ప శక్తులు విరాజిల్లుచున్నవి. అయ్యవి నిగూఢములుగ నుండుటవలన ఎవరికి వాని యొక్క పరిచయము కలుగుటలేదు. నిదురించుచున్న కుండలినీ శక్తి యోగాభ్యాసముచే ఏ ప్రకారము పైకి లేచునో, ఆ ప్రకారమే మానవుని యందంతర్లీనములై యున్న దివ్య పారమార్థిక శక్తులు అతని సత్ప్రయత్నముచే లెస్సగ ప్రస్ఫుటములు కాగలవు. బంగారము ఇతర లోహముతో గూడి యుండినపుడు దానికేమంత విలువయుండదు. కాని, బాగుగ పుటము గావింపబడి మేలిమిగా మారునపుడు దానికి గొప్ప విలువ యేర్పడుచుండును. అట్లే అజ్ఞాన పరివేష్టితుడై, అసుర గుణాభిభూతుడై, అపవిత్ర హృదయుడై యుండునపుడు జీవునకు విలువయుండదు. అతని నెవరును లెక్కచేయరు. అయినను అంతమాత్రముచేత నతడు నిర్లక్ష్యము చేయదగినవాడు కాడు. ఏలయనిన, అతనియందు పవిత్రాత్మయుండియే యున్నది. దానిని వ్యక్తమొనర్పవలెను. సత్సాంగత్యము చేతను, మహనీయుల సద్బోధలచేతను అట్టి ఆత్మస్థితి తప్పక చేకూరగలదు. అత్తటి యింతదనుక ఎంతయో నీచుడుగ పరిగణింపబడువాడు సంఘమున సర్వోత్తముడుగ గణుతి

కెక్కెను. కావున పాపము చెడ్డది కాని పాపి చెడ్డవాడు కాడు. పాపి యేనాటికైనను పుణ్యాత్ముడు కాగలడు. ప్రయత్నాతిశయముచే మానవుడు మాధవుడు కాగలడు. పశువు పశుపతి కాగలదు. ఈ సత్యమునే శ్రీ గురుదేవులు తమ జీవితమందు పదే పదే యుద్ఘాటించుచుండువారు. కాబట్టి ప్రతి జీవియు తన నికృష్ట స్థితిని జూచి నిరుత్సాహము జెందక, హృదయమును చక్కగ పరిశోధించుకొని, అసుర గుణములు, దుస్సంకల్పములు, దుర్వాసనలు తమయందేవైన యుండిన వానిని సమూలముగ తొలగించివేసి, దైవమే అయి శోభిల్లవలెను. ఈ ప్రకారముగ అట్టివాడు మహాత్ముడు కాగల్గు సదవకాశమును శాస్త్రములు జనులకొసంగి యున్నవి. కావున ప్రతిజీవియు తన హృదయమును చక్కగ వికసింప జేసికొని జీవిత పరమావధియగు స్వస్వరూప (ఆత్మ) సాక్షాత్కారమును బడసి ధన్యుడు కావలయును.

ఈ ప్రకారములైన సర్వ జీవ సంతారణరూపములగు మహత్తర సద్బోధలను శ్రీవారు గావించుచు జనులకుత్తేజమును గలిగించుచుండెడివారు. ఆధ్యాత్మక్షేత్రమున ఆంధ్రభూమియందు గొప్ప క్రాంతిని, సంచలనమును శ్రీవారు తీసికొనివచ్చిరి. వారు వచ్చిన వెనుక ఆంధ్రభూమిలో ఎన్నియో ఆశ్రమములు ఉద్భవించినవి, ఎన్నియో పీఠములు ఆవిర్భవించినవి. ఎందఱో సామాన్యజనులు ముముక్షువులైరి. ఎందఱో ముముక్షువులు ముక్తులైరి. శుష్కవేదాంత తమో

జాలమును ప్రజల హృదయ వీధులనుండి దూరీకరించుటకు వారెట్లు కంకణము కట్టుకొనిరో, అట్లే వేదాంత భేరిని దశదిశల మారు మ్రోగించుటకును వారు కటిబద్ధులైరి. వేదాంత పితామహులగు అట్టి మహనీయులైన సద్గురువుల బోధలు జనులకు ఎంతయో అవసరములై యున్నవి.

పర్వతమును బోలిన స్థైర్యము, సముద్రమును బోలిన గాంభీర్యము, ఆకాశమును బోలిన విశాలహృదయము గల్గి తమ యపార తపశ్శక్తిచే ఆంధ్రలోకమున గొప్ప ఆధ్యాత్మిక సంచలనమును గావించి నైతికముగ అఖండ ఉత్తేజమును జనులలో రేకెత్తించిన యతిపుంగవులు బ్రహ్మర్షి శ్రీ మలయాళస్వాములవారు. వారు లోకమునకు ప్రసాదించిన జ్ఞానసంపద అక్షయమై, అవ్యయమై, నిత్యనూతనమై యలరారుచున్నది. వారి దివ్యప్రవచనములు, అమృతహితోక్తులు, ఒక దేశమునకు గాని, ఒక కాలమునకుగాని సంబంధించినవి కావు. ఒక జాతికిగాని, ఒక వర్ణమునకుగాని చెందినవి కావు. అవి సార్వకాలీన, సార్వజనీన, సర్వమత సంసేవ్యములైన ఆధ్యాత్మిక దివ్యరహస్యములు.

లోకములో సామాన్యుడు తన ప్రయత్నాతిశయముచే మాన్యుడు కాగలడు. అరిసదృశుడు తన పూనికచే హరిసదృశుడు కాగలడు. ప్రయత్నముచే మానవుడు సాధింపరానిదీ ప్రపంచమున ఏదియును లేదు. భౌతిక క్షేత్రమందుగాని, ఆధ్యాత్మిక క్షేత్రమందుగాని వ్యక్తి తన అధ్యవసాయ

ముచే మహోన్నత శిఖరముల నధిష్ఠింపగల్గు చున్నాడు. చిన్న రాజ్యమునకు అధినేతయైన సిద్ధార్థుడు తన వివేక వైరాగ్యముల చేతను, గొప్ప పట్టుదల చేతను, ఇంద్రియ నిగ్రహ మనోనిగ్రహములను సాధించివైచి అచిర కాలములో ఆత్మసామ్రాజ్యమునకు అధినేతయై బుద్ధదేవుడుగ విఖ్యాతి నొందెను గదా! అట్లే శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, గాంధిజీ మొదలైన ఆధునిక వ్యక్తులు తమ యకుంఠిత దీక్ష చేతను, భగవద్భక్తి చేతను, సాధనాతిశయము చేతను విశ్వవంద్యులై, లోకోత్తర పురుషులై, బ్రహ్మర్షులై విలసిల్లిరి.

మహర్షిత్వముగాని, బ్రహ్మర్షిత్వముగాని ఒకరిసొత్తు గాదు. అది ఒకానొక జాతిచేగాని, వ్యక్తిచేగాని, వర్ణముచే గాని గుత్తకు (contract) తీసికొనబడు పదార్థము కాదు. యోగ్యతగల వారందరున్ను బ్రహ్మర్షిత్వమునకు అర్హులే. పవిత్రత, సహనము, పట్టుదల (purity, patience, perseverence) గలవారు ఏనాటికైనను బ్రహ్మర్షిత్వమును సాధించియే తీరుదురు. వ్యక్తియందు దుర్వృత్తులు, దుర్గుణములు, దుస్సంకల్పములు ఉండునపుడు, భగవంతుని దృష్టియందుగాని, లోకులయొక్క దృష్టియందుగాని యతడు చాల అల్పుడుగనే యుండును. బంగారము ఇతర లోహములతో గూడియున్నపుడు దానికి విలువ చాల తక్కువగనేయుండును గదా! ఆ బంగారమే అగ్నిహోత్రముపై బాగుగ పుటము

పెట్టబడినపుడు దాని యందలి యితర లోహములన్నియు ఆవిరియై పోగా, స్వచ్ఛమగు మేలిమి బంగారుగ మాత్రమే శేషించును. అపుడు దాని విలువయు చాల పెరుగును. అట్లే తపస్సు, ఇంద్రియనిగ్రహము, భగవద్భక్తి మున్నగువానిచే మనస్సునందలి దోషములన్నియు పరిహరింపబడినపుడు, పాపాత్ముడున్ను పుణ్యాత్ముడై పరగును. అల్పుడు లోకోత్తరుడుగ చెన్నొందును. సామాన్యుడు విశ్వవంద్యుడై యలరారును. మహాత్ములు తమ జీవితముల నీ ప్రకారమే ప్రయత్నపూర్వకముగ సంస్కరించుకొని లోకములో గణనీయ స్థానము నలంకరించిరి.

ఆధ్యాత్మిక చరిత్రయందౌన్నత్యము పొందిన మహనీయుల జీవిత చరిత్రములన్నిటిని పరికించినచో ఏదియో యొక అద్భుతసంఘటన (Miracle) వలన ఒక్కపర్యాయము ఆకస్మికముగ వారు పైకివచ్చినట్లు కానంబడుటలేదు. ఒక క్రమపద్ధతియందు నెమ్మది నెమ్మదిగా వారు చేసిన సాధనల ననుసరించి ఉన్నతస్థానమున కెగ్రాకినట్లే కనుపించుచున్నది. గురుదేవులగు శ్రీ మలయాళస్వాములవారున్ను బాల్యకాలమునుండియు తీవ్రతర ముముక్షుత్వము గలవారై భగవద్భక్తి సంయుతులై, పరమార్థసాధనలను లెస్సగ గావించుచు క్రమక్రమముగ ఊర్ధ్వస్థితినిబడసి బ్రహ్మర్షియై విలసిల్లిరి. అనుష్ఠానమందు వారికిగల ప్రీతి, నియమబద్ధమగు జీవితమును గడపుటయందు వారి పట్టుదల, దైనందిన

వ్యవహారములందును చక్కని క్రమశిక్షణ గల్గియుండవలెనని వారు కావించుబోధ జనులలో వారియెడల భక్తి శ్రద్ధలను ఇనుమడింపజేసినవి. తత్ఫలితముగ ఆంధ్ర దేశముననే గాక, తదితర ప్రాంతములందును వారు ఆరాధ్యులై పఱగుచు, జనుల జీవితనౌకలకు ధ్రువతారయై యొప్పుచుండిరి.

"సర్వజీవరాసుల యెడల ప్రేమ, దయ, కరుణగలిగి యుండుడు! భక్తి, జ్ఞాన, వైరాగ్యములను మందుతో బాటు సర్వభూతదయ యను పథ్యమును గూడ అవలంబింపుడు" అనునది వారి బోధలలో ప్రధానమైనది. ఇట్టి విశాల హృదయము, విశ్వప్రేమ ముముక్షువుల కత్యావశ్యకమై యున్నవి. బ్రహ్మర్షిత్వమున కర్హతయు నిదియే. సంకుచిత హృదయులు, దయాదాక్షిణ్య వర్జితులు భగవంతునెన్నటికిని బొందజాలరు. కావున, ముముక్షువులెల్లరు తమ భక్తి, జ్ఞానాద్యుపకరణములతో బాటు ప్రాణికోట్ల యెడల దయను గూడ అభ్యసించవలయును. ఇట్టి అపారకరుణ, విశాల హృదయము గలిగియుండుటవలననే శ్రీ మలయాళస్వాముల వారు ఉన్నతపథము నధిరోహింపగల్గి బ్రహ్మర్షులై విఖ్యాతి నొందిరి, కావున ముముక్షువులెల్లరును వారి యాదర్శమును గ్రహించి, అనన్యభక్తి, నిరంతర తత్త్వచింతన, అధ్యాత్మిక క్రమశిక్షణ, నియమపాలన, సర్వభూతదయ మొదలగు ఉదాత్తగుణముల నవలంబించి బ్రహ్మర్షిత్వమును కైవస మొనర్చుకొని పరమానందమయులై జీవితమును ధన్య మొనర్చుకొందురు గాక!

శ్రీ స్వాములవారు ఆదర్శ కర్మయోగియు అయియున్నారు. ఒక్క నిమిషమైనను వారు కాలమును వ్యర్థము చేయరు. సాధన కాలమందు తపోధ్యానాదులందు ఎక్కువ కాలమును వారు వినియోగించి, తపస్సిద్ధి అయిన వెనుక లోకోపకార కార్యములందు నిష్కామ భావముతో, కర్తృత్వ రహితముగ ప్రవర్తించుచుండువారు. అట్టి సమయమందు కూడ వారు తమ ధ్యానాది అనుష్ఠానములకు కొంతసమయమును తప్పక వినియోగించుచునే యుందురు. శ్రీ శంకరాచార్యులవారు శివానందలహరిలో చెప్పిన విధముగ శ్రీవారు కొంతకాలము ధ్యానమందును, కొంతకాలము సద్గ్రంథ పఠనమందును, కొంతకాలము భక్తులకు కావించు ప్రబోధ మందును, కొంతకాలము గ్రంథరచన యందును, కొంత కాలము బ్రహ్మవిద్యా ప్రచారమందును గడుపుదురు.

ఇక శ్రీ స్వాములవారు సంఘమునకు, సమాజమునకు కావించిన మహత్తర సేవనుగూర్చి తెలిసికొందము.

శ్రీ స్వాములవారి సంఘసేవ

ఆ రోజులలో సంఘమునందు, మానవసమాజమునందు ఎట్టి వాతావరణమున్నదో ఒకింత తెలిసికొనవలసి యున్నది. 'స్త్రీలుగాని, శూద్రులుగాని భగవద్గీతాది గ్రంథములను చదువగూడదు, తాకగూడదు. సంస్కృతమును వేదవాఙ్మయమును పఠించుటకు వారికి అధికారము లేదు' - అనునిట్టి

దురభిప్రాయములు, దురాచారములు, కరుడు గట్టిన సాంఘిక దురాచారములు, అసమానభావములు జనులలో రూఢిపడి యున్న రోజులవి. అత్తఱి దక్షిణదేశమున శ్రీ నారాయణ గురుదేవులవతరించి అందఱికిని 'ఒకేజాతి ఒకేమతము, ఒక్కే దేవుడు' అని బోధించి జనుల హృదయములను బాగుగ సంస్కరించిరి. వారి ప్రశిష్యులే శ్రీసద్గురు మలయాళస్వాముల వారు. వీరున్ను వారిగురుదేవుల పగిది జనులలో వ్యాపించి యున్న సంకుచితత్వమును పారద్రోలి, తమ అనుభవ వాక్యములచే సంఘములో గొప్ప ఆధ్యాత్మిక విప్లవమును కలుగజేసిరి. వారి దివ్యబోధలచే ఎందఱో తమ జీవితములను సంస్కరించుకొనిరి. శ్రీ స్వాములవారు తమ పవిత్ర ఆచరణ ద్వారా, తమ దివ్యప్రబోధముల ద్వారా, ఆంధ్రదేశమున అపూర్వమగు ఆధ్యాత్మిక సంచలనమును గావించిరి. పరమార్థరంగమున, సాంఘికరంగమున గొప్పప్రగతిని సాధించిరి.

అన్ని మతములయొక్క లక్ష్యము ఒకటేయని బోధించి శ్రీ స్వాములవారు మతసామరస్యమును ప్రోత్సహించిరి. దైవమతము, కరుణామతము, శాంతిమతము, సత్యమతము, స్వాతంత్ర్యమతము, ఋషిమతము, జ్ఞానమతము మున్నగునవి వర్ధిల్లవలెనని శ్రీవారు తఱచు చెప్పుచుందురు. సంఘ వ్యతిరేక శక్తులను ధైర్యముతో నెదుర్కొని శ్రీవారు విజయమును సాధించిరి. మిథ్యాచారుల కపటములను, మోసములను, వేషములను, మాలిన్యములను, వ్యసనములను, మూఢా

చారములను శ్రీవారు ఖండించివైచి సమాజములో పవిత్రతను నెలకొల్పుటకై తీవ్రతర కృషి సలిపిరి. వాని నెదుర్కొనుటకు ఆవిర్భవించిన గ్రంథమే శ్రీవారి ప్రప్రథమ రచనయగు 'శుష్కవేదాంత తమోభాస్కరము'.

శ్రీ స్వాములవారి ధర్మప్రబోధములచే జనులు జాగ్రతులై తాము ఋషిసంతతివారని తెలిసికొనగలిగిరి. వారి పాదస్పర్శచే ఆంధ్రదేశమేకాక భారతావని యావత్తు పునీతమైనదని చెప్పవచ్చును. స్వారాజ్యముయొక్క అనగా ఆత్మ సామ్రాజ్యముయొక్క ప్రాముఖ్యతను జనులకు తెలియజేయుట, కులమతాది భేదములతో దిగజారిపోయిన మానవాళికి సర్వసమభావమును ప్రబోధించుట జాతి మత కుల లింగవయో విచక్షణలేక జిజ్ఞాసువులైన ప్రతివారికి దైవతత్త్వమును తెలియజేయుట, అధ్యాత్మ వాఙ్మయమున నిక్షిప్తములైయున్న జ్ఞానరత్నములను బయటకు తీసి సర్వజనులకు అందించుట, సంసారతాప పరితప్తులగువారు ధ్యానాదులు సలుపుకొని ప్రశాంతిని బడయుటకై ఆశ్రమములను స్థాపించుట మున్నగునవి శ్రీ స్వాములవారి ముఖ్య ఆశయములై యున్నవి. బుద్ధి కుశలతచే వారి నన్నింటిని శ్రీవారు తమ జీవితకాలమందే చక్కగ సాధించివైచిరి.

సాంఘిక ఆధ్యాత్మిక రంగములందు శ్రీవారి ప్రబోధ ప్రచారములచే ఎన్నియో విప్లవాత్మకములైన పరిణామములు సంభవించినవి. జనులలో సంకుచితములైన భావములు

తొలగి విశాలభావములు ఏర్పడినవి. సాంఘిక ఆధ్యాత్మిక రంగములందు వెనుకబడియున్న స్త్రీలు, ద్విజేతరులు ఆయా రంగములలో లెస్సగ పురోగమించిరి. శ్రీవారి ప్రబోధములచే జనులలో ప్రగతిశీలమైన దృక్పథము ఏర్పడినది. భౌతికాభివృద్ధితో తృప్తిపడక ఆత్మోన్నతికి కూడ కృషి సలుపవలెననియు, విశ్వశ్రేయస్సునకై శక్తికొలది పాటుపడవలెననియు శ్రీవారి ప్రబోధములచే జనులు తెలిసికొనదొడగిరి,

శ్రీ వ్యాసాశ్రమ స్థాపకులగు శ్రీ మలయాళస్వాములవారు దైవాంశసంభూతులు. ప్రజల అజ్ఞాన మేఘములను విచ్ఛిన్నమొనర్చి జ్ఞానాలోకమును కలుగజేయుటకై అవతరించిన మహనీయులు. చెప్పినది చేయుట, చేసినది చెప్పుట వారి యందలి ఒక గొప్ప విశేషము. శ్రీవారి జీవితము ఒక విస్తృతఅధ్యాత్మిక ప్రయోగశాల(Spiritual Laboratory) అని చెప్పవచ్చును. వారు సాధనచేయునపుడు ఎన్నియో కష్టములను ఎదుర్కొనిరి. రోజులతరబడి ఏమియు భుజించని సందర్భములు కూడ వారి జీవితమున కలవు. అయినను భగవంతునిపై పరిపూర్ణ విశ్వాసముంచి తపస్సును కొనసాగించి ఎట్టకేలకు విజయమును సాధించిరి. పవిత్రత, సహనము, పట్టుదల అను మూడు ఉదాత్తగుణములు శ్రీవారి యందు ప్రస్ఫుటముగ కానుపించును. తీవ్రతపంబుసలుపుట, తపస్సిద్ధ్యనంతరము ఆశ్రమమును స్థాపించుట, క్రమశిక్షణాదులను

గఱపుట, ఆధ్యాత్మిక పత్రికను స్థాపించుట, సభలను నిర్వహించి బ్రహ్మవిద్యాప్రచారమును చేయుట, గ్రంథరచన గావించుట, సంస్కృత పాఠశాలలను స్థాపించుట మొదలగు ఇన్ని మహత్తర కార్యములను ఒక్క వ్యక్తి ఎట్లు చేయగలిగెనో ఆలోచించినచో ఆశ్చర్యము కలుగకమానదు. అయితే ఇన్ని మహత్తర కార్యములనొనర్చినను శ్రీవారు అసంగులై వానితో తగుల్కొనక, నిర్లిప్తులై యుందురు. ఇదియే శ్రీ స్వాములవారి యందలి గొప్ప విశిష్టత. 'అసంగానందస్వామి' అను తమ పవిత్రనామధేయమును శ్రీవారు సార్థకపఱచిరి.

నియమనిష్ఠలను పాలించుటలోను, ఇతరులచే పాలింపజేయుటలోను, శ్రీ స్వాములవారు అందెవేసిన చేయి. జీవితమంతయు నియమబద్ధముగా గడుపవలెనను దృఢసంకల్పము కలుగు దశనుండియే మానవత్వము ప్రారంభించునని శ్రీవారు తఱచు సెలవిచ్చుచుందురు. ఆధ్యాత్మిక నియమ నిబంధనలకు, క్రమశిక్షణకు శ్రీవారెంతయో ప్రాధాన్యత నొసంగుచుందురు. శ్రీవారి క్రమశిక్షణావిధానము వజ్రతుల్యముగ నున్నను, దాని వెనుక నవనీతహృదయము దాగియుండును. శ్రీవారిలోని గొప్ప విశేషములలో ఇది యొకటి. బ్రహ్మవిద్యాపారంగతులు, అపరశంకరులు, ఆధునికవ్యాసులు, అవిద్యాతమోభాస్కరులు అగు శ్రీ స్వాములవారు తాము తరించి ఇతరులను తరింపజేయుటలో అహరహము కృషి చేసిరి.

శ్రీవారు గోగర్భమునందు తపస్సు చేయు కాలములో జనులయందు సాంఘిక దురాచారములు, వర్గవైషమ్యములు తాండవించుచుండెను. దురాచారములు అంటుజాడ్యమువలె వ్యాపించుచుండెను. కులమత ద్వేషములు మానవజాతి మనుగడకే అడుగడుగున ఆటంకములు కల్పించుచుండెను. విశాల భావములు కల శ్రీ స్వాములవారు అదియంతయు గమనించి, వారి బోధలచే, రచనలచే, ఆచరణచే జనులలోని సంకుచిత భావములను పారద్రోలి, సమరసభావమును స్థాపింపజేసి వేదాంతరహస్యములు తెలిసికొనుటకును, అంతఃకరణ ప్రశాంతతను అనుభవించుటకు జాతి మత కులము లెవ్వియు అడ్డురావనియు, సర్వులును వాని ననుభవించవచ్చుననియు బాహాటముగ చాటివైచిరి. శ్రీవారి ఇట్టి విశాలదృక్పథము జనులలో ఎంతయో సత్ప్రభావమును కలుగజేసినది. జాతి మత కుల భేదములు లేక ఎందఱో వేదాధ్యయనమును ప్రారంభించిరి. సంస్కృతము చదువ నారంభించిరి. బ్రహ్మ విచారణ, బ్రహ్మాభ్యాసము చేయ మొదలిడిరి. స్త్రీలు ఎందఱో భగవద్గీతాది సద్గ్రంథములను పఠించి జపధ్యానాది ఆధ్యాత్మిక సాధనలను చేయ నారంభించిరి. ఈ ప్రకారముగ శ్రీ స్వాములవారు సంఘమున విప్లవాత్మకమైన పరిణామములు కలుగజేసి ఒక గొప్ప క్రాంతిని తీసికొనివచ్చి జనులకు నూతన చైతన్యమును కలుగజేసిరి.

కార్యదక్షత, బ్రహ్మర్షిత్వము, కోమలహృదయము, తపోమహిమ, నిర్వికల్పధ్యానము, విద్యావైదుష్యము, భక్తి జ్ఞానవైరాగ్యములు-అన్నియు శ్రీ స్వాములవారియందు నెలవు చేసికొనినవి.

శ్రీ స్వాములవారి జీవితము భగవద్గీతకు భాష్యమని చెప్పవచ్చును. వారి తపోనిష్ఠ, తీవ్రవైరాగ్యము, కార్యదక్షత, విజ్ఞానము, దూరదర్శిత్వము, అసంగత్వము, నిర్వికారత్వము, విశాలహృదయము, పరోపకారకాంక్ష, జనులకు మార్గదర్శకములై యున్నవి. వెయ్యేల ఆధ్యాత్మికాకాశమున శ్రీ స్వాములవారు ధ్రువతారయై విలసిల్లుచున్నారు. దీనత్వమును విడిచి ధీరులుకండని శ్రీవారు తఱచు ఉద్బోధించుచుందురు. ఆర్ష సంస్కృతిని ఉద్ధరించి ఋషులవలె ధీరోదాత్తులై మెలగుడనియు శ్రీవారి ఉద్బోధ. వారి మాట లోకాభ్యుదయమునకు బాటయై చెన్నొందినది. నిద్రాణమై యున్న ప్రజానీకమును మేలుకొలుపుటకు శ్రీవారు కంకణము కట్టుకొనిరి. శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులు, ఆంధ్ర వేదాంత పితామహులు, సనాతన ధర్మోద్ధారకులు, అనుష్ఠానతత్పరులు అగు శ్రీ స్వాములవారు కేరళదేశమున జన్మించినప్పటికిని, ఆంధ్రావనియందే తపంబు సలిపి, ఆంధ్రులకు అన్నిరంగములందును మహోపకృతి నొనర్చి భక్తుల పాలిట కల్పతరువై విరాజిల్లిరి.

లోకోద్ధరణకై అవతరించిన కారణ జన్ములువారు. ఆంధ్రదేశ బ్రహ్మవిద్యా చరిత్రలో శ్రీవారి దొక స్వర్ణాధ్యా

యము. మానవసమాజ వికాసమునకు శ్రీ స్వాములవారు ఎనలేని కృషిసలిపి జనులు పవిత్రజీవితమును, నిష్కళంకవర్తనము కలిగియుండుటకెంతయో దోహదమును కలుగజేసిరి. శ్రీ స్వాములవారికి భగవంతునిపై పరిపూర్ణవిశ్వాసముకలదు. "అంతయు దైవసంకల్పము. ఆ సర్వేశ్వరుడేమి చేయించ దలంచిన అది జరుగుచుండును. ఇందు మన కర్తృత్వమేమియు లేదు. పరమాత్మ ఏయే కార్యములను చేయించుటకు నన్ను పుట్టించెనో ఆ యా కార్యములన్నియు నాచే చేయించినారు. మేము మొదటి నుండియు భగవంతుని నమ్మి జీవించు చున్నాము. మాకేది అవసరమని తోచునో, దానిని ఆ కరుణామయుడే సమకూర్చును" — అని శ్రీవారు అపుడప్పుడు చెప్పుచుందురు.

ఈ ప్రకారముగ అకుంఠిత దైవభక్తి, క్రమశిక్షణ, శాస్త్రవిజ్ఞానము, అధ్యాత్మిక అనుభూతి గలిగియున్న శ్రీ మహర్షి సద్గురు మలయాళస్వాములవారి పవిత్ర జీవితము జనులకు ఆదర్శవంతమై, మార్గదర్శకమై యలరుచున్నది. ముముక్షువులిద్దానిని శ్రద్ధగా పఠించి శ్రీవారి దివ్యబోధలను కార్యాన్వితి మొనర్చి పరమానందము ననుభవించుదురు గాక!

★

ఓమ్

శ్రీ స్వాములవారు కావించిన ప్రజోప యోగ కార్యములు

★

1. ముముక్షువులు ఆధ్యాత్మిక సాధనల నొనర్చుట కొఱకు ఏకాంతకుటీరములు తదితర సౌకర్యములు కలిగి యున్న శ్రీ వ్యాసాశ్రమము అను ఒక చక్కని ఆశ్రమమును చిత్తూరు జిల్లా - ఏర్పేడు గ్రామ సమీపమున స్థాపించిరి. ముముక్షువుల కచట ఆధ్యాత్మిక శిక్షణ, ప్రబోధము లభించు చుండును.

2. పరమార్థ విజ్ఞానమును ప్రజలకు అందజేయు నిమిత్తము 'యథార్థభారతి' అను ఆధ్యాత్మిక మాస పత్రికను ప్రారంభించిరి.

3. సనాతన వేదాంత తత్త్వమును అందఱికిని తెలియ జేయుటకొఱకు శ్రీ సనాతన వేదాంత మహాసభ అను వార్షిక సమావేశమును ఏర్పాటు చేసిరి.

4. జిజ్ఞాసువులు బ్రహ్మజ్ఞానమును చక్కగ అభ్యసించు నిమిత్తము బ్రహ్మవిద్యా పాఠశాల అను దానిని స్థాపించిరి.

5. ఆర్షవిద్యయగు సంస్కృతమును, తదితర విద్యలును, సర్వులు నేర్చుకొనుట కొఱకై పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా పాఠశాలలను స్థాపించిరి. ఆ పాఠశాలలందు జాతి, మత, కుల విచక్షణ లేక సర్వులును విద్య నభ్యసించ

వచ్చును. స్త్రీల పాఠశాల 'కన్యా గురుకులము' అను పేరుతో వ్యవహరింపబడుచున్నది.

6. ఆధ్యాత్మిక వాఙ్మయము అందరికిని అందుబాటులో నుండు నిమిత్తమును, తాము సంపాదించిన పరమార్థ అనుభూతిని సర్వులకు అందజేయుటకును పెక్కు ఆధ్యాత్మిక గ్రంథములను రచించిరి.

★

శ్రీ స్వాములవారు తరుచు బోధించు నియమములు

1. మూడు నియమములు :—
   (1) ఆహార నియమము (2) నివాస నియమము
   (3) అనుష్ఠాన నియమము.
2. మూడు విధులు :—
   (1) యుక్తాహారము (2) వివిక్త వాసము
   (3) బ్రహ్మచింతనము.
3. పంచవిధ ప్రాయశ్చిత్తములు :—
   (1) ఉపవాసము (2) మౌనము (3) దివ్య మంత్ర జపము (4) పశ్చాత్తాపము (5) అన్నదానము.
4. పంచ శుద్ధులు :—
   (1) వస్త్ర శుద్ధి (2) స్థల శుద్ధి (3) పాత్ర శుద్ధి
   (4) కాయ శుద్ధి (5) వాక్శుద్ధి.

శ్రీ స్వాములవారి సన్నిధియందు నా అనుభవములు

★

అనుభవజ్ఞులగు మహాత్ములచెంత నివసించుట, వారి వాక్యములను వినగల్గుట, వారికి సేవచేయు అవకాశమును బడయుట ఒక మహాద్భాగ్యమే యగును. శ్రీ మహర్షి సద్గురు మలయాళ స్వాములవారి సన్నిధియందు పండ్రెండు వత్సరముల కాలము నివసించి వారికి, వారు స్థాపించిన శ్రీ వ్యాసాశ్రమమునకు ఉడుతాభక్తిగ సేవచేయు సదవకాశము నాకు కలిగినందులకు చాల సంతోషించుచున్నాను. రాతిని శిల్పి తన చాతుర్యముచే విగ్రహముగ మార్చునట్లు, అనేకమంది ముముక్షువులైన సాధకులను తమ హితోక్తులచేతను, అనుభూతితో మేళవించిన సద్బోధలచేతను, క్రమ శిక్షణచేతను శ్రీవారు విజ్ఞానసంపన్నులుగను సద్గుణవంతులుగాను, తయారుచేసిరి.

శ్రీవారి యొక్క అకళంక ప్రవర్తనము, అపార దైవభక్తి, నియమ నిష్ఠలయందాసక్తి, గొప్పపట్టుదల, నిరాడంబరత్వము, కార్యదక్షత, ప్రగాఢ వైరాగ్యము, శాంత స్వభావము, సర్వ భూతదయ, శాస్త్ర కుశలత్వము, పరోపకార పారీణత, క్షమా శీలత్వము మొదలగు ఉదాత్త గుణగణములు సర్వులకును మార్గదర్శకములై యున్నవి.

చిన్న కార్యములైనను వానియందు శ్రద్ధచూపుట, వానిని పెద్దబుద్ధితో చేయుట శ్రీవారి ఒక ప్రత్యేకత. ఆంగ్లమున ఒక సూక్తి కలదు —

The greatness of a man lies not in doing **great** things in a great way, but in doing small **things** in a great way,

'ఒకని యొక్క గొప్పతనము పెద్ద పెద్ద కార్యములను పెద్ద బుద్ధితో చేయుటయందు లేదు. చిన్న కార్యములను పెద్ద బుద్ధితో చేయుటయందు కలదు.

1. శ్రీ వ్యాసాశ్రమమందున్న రోజులలో ఒకనాడు నేను నేలకు అనునట్లు పెద్దపంచ కట్టుకొని పూజామందిరమువైపు నుండి పోవుచుండ శ్రీవారు పిలిచి 'ఏయ్, కట్టుకొను పంచ నేలకు తగులగూడదు. పాదమునకు కొంత పైగానే ఉండునట్లు ధరించవలెను'. అని బోధించిరి.

2. ఒకనాడు ఆశ్రమ కార్యార్థమై ఊరికి ప్రయాణమై పోవుచున్న సందర్భమున పెట్టె మొదలగు సామగ్రిని ఒకరి చేతికిచ్చి నేను వెనుకగా నడచిపోవుచుండ ఆ మహనీయుడు చూచి వెనువెంటనే నన్ను పిలిచి సామగ్రి మొత్తము ఒకరి చేతికిచ్చి నీవేమియు పట్టుకొని పోకుండ వెడలుట మంచిదికాదు, అది సభ్యతకాదు. ఏదియో ఒక చిన్న వస్తువునైనను పట్టుకొని పోవలెను' అని సెలవిచ్చిరి. ఆ వాక్యములు నా కెంతయో ప్రభావమును కలుగజేసినవి. నా జీవితమునందవి లెస్సగ ఉపకరించినవి.

3. మఱియొక సంఘటనకూడ కలదు. అది 1947 వ సంవత్సరము. శ్రీవారు నాకు సన్న్యాసదీక్ష ఇచ్చిన సందర్భమది. దీక్షా కార్యక్రమము ఐదు రోజులు శాస్త్రోక్తముగ జరిగినది. చివరి రోజున సన్న్యాసగ్రహీత భిక్షాటనము చేసి. ఆ అన్నమును గురువుగారికి సమర్పించి, ఒకింత తాను గూడ భుజించవలెను. అది నియమము. అట్లే నేను భిక్షాటనము చేసి, జోలియందున్న అన్నమును, కూరలను, భక్ష్యములను శ్రీవారికి వడ్డించితిని. తదుపరి ఒకింత నేను కూడ వడ్డించుకొంటిని. భోజనమైన తదుపరి నా విస్తరియందు భక్ష్యపదార్థ మొకింత విడిచి పెట్టబడియుండుటను శ్రీవారు గమనించిరి. అనంతరము శ్రీవారు నన్ను పిలిచి భోజనము చేయునపుడు వడ్డించిన ఏ పదార్థమును గూడ ఒకింతైనను పారవేయగూడదు. వడ్డించువారికి ముందుగనే చెప్పి మితముగా పెట్టించుకొనవలెను. అప్పటి నుండియు ఆహార విషయమై కడు జాగరూకుడనై యుంటిని.

4. 1955 వ సంవత్సరమందు కోలారు జిల్లాలోని అగరం గ్రామములో శ్రీ సనాతన జ్ఞానమహాసభయొక్క 29 వ, సమావేశము జరుగుచుండెను. ఆ సందర్భమున శ్రీవారు నన్ను పిలిచి 'ఇకమీదట మీరే ఈ సనాతనసభలకు అధ్యక్షులుగా ఉండవలసినది' అని ఆదేశించిరి. అంతటి బాధ్యతాయుతమైన కార్యమును నిర్వహించగలనాయని నాలో నేను ఆలోచించుకొనుచుండగా శ్రీవారు నాకు ధైర్య

మును పురికొల్పి అకార్య నిర్వహణమును ప్రోత్సహించిరి. శ్రీవారి దివ్యానుగ్రహప్రభావముచే శ్రీసనాతన వేదాంతజ్ఞానసభ నిరాటంకముగా కొనసాగి పోవుచున్నది.

5. ఒకానొక సనాతన వేదాంతజ్ఞాన మహాసభలో కార్యక్రమము ప్రారంభమగుటకు కొంచెము ముందుగా శ్రీవారు నన్ను పిలిచి "సభలో ఉపన్యసించునపుడు మొత్తము తెలుగు భాషలోనే కాకుండ మధ్య మధ్య ఇంగ్లీషు వాక్యములను కూడ ప్రయోగించుచుండుము. సాధువులకు విద్యలేదని కొందరు తలంచవచ్చును." శ్రీవారి వాక్యములను శిరసావహించి అట్లే చేయుచుంటిని. సాధువులు విద్యావంతులు కావలెననియు, బ్రహ్మవిద్యను చక్కగ లోకములో వ్యాపింపజేయవలెననియు శ్రీవారి అభీష్టము. ఈ విషయమును తెలుపు మఱియొక సంఘటనను వివరించెదను —

6. "అది సర్వజిన్నామ సంవత్సరము, ఆషాఢ శుద్ధ ఏకాదశీ పవిత్ర దినము (29—6—1947). గురుదేవులగు శ్రీమహర్షి మలయాళస్వాములవారి ద్వారా ఈ యుపాధి సన్న్యాసాశ్రమము స్వీకరించిన సుముహూర్తము. ఆ క్రిందటి రోజున శ్రీ స్వాములవారు ఏకాంతమునకు పిలిపించి "సన్న్యాసక్రతువు సమీపించుచున్నది. పూర్వాశ్రమమునందలి పేరు తొలగించి నూతన నామధేయ మొసంగవలసియున్నది. మీకు ఏ పేరు ఇష్టమో తెలియజేయుడు" అని ప్రశ్నించిరి. అత్తఱి ఒకటి, రెండు పేర్లు నేను సూచించితిని

కాని శ్రీవారు ఇష్టపడలేదు. "బ్రహ్మవిద్యను లోకములో బాగుగ ప్రచారము చేయవలెను. ఈ నా ఉద్దేశము మీకు సదా జ్ఞాపకముండుట కొఱకై 'విద్యాప్రకాశానంద' అని మీకు పేరుపెట్టదలచినాను." అని శ్రీవారు సెలవిచ్చిరి. ఆనాడు వాత్సల్యపూరిత హృదయులై కరుణతో శ్రీవారు పలికిన ఆ పలుకులు తఱచు స్మృతి పథమునకు వచ్చుచు కర్తవ్యమును సూచించుచు అధ్యాత్మవిద్యాప్రచారమును గూర్చిన భావములను మనంబున ఉద్దీపింపజేయుచుండెను.

7. క్రమశిక్షణతో అన్ని కార్యములు జరుగవలెనని శ్రీవారి అభిప్రాయము. అందుచే శ్రీ వ్యాసాశ్రమమున ఉదయము నుండి రాత్రి వరకు జరుగు అన్ని కార్యములు సక్రమముగా సమయము ప్రకారము జరుగుచుండును.

ఉదయము బ్రహ్మముహూర్తమున గీతాపారాయణమునందు గీతాశ్లోకములను చదువుట, సాయంత్రము సమావేశములలో శ్రీవారి సన్నిధియందు ఆధ్యాత్మిక గ్రంథమును పఠించుట, మధ్యాహ్నకాలమున టపాలు శ్రీవారికి చదివి వినిపించుట అను కార్యక్రమములు నాకు అప్పచెప్పబడినవి. ఆయా కార్యములు నిర్వహించుటకు ఆయా సమయములందు ఖచ్చితముగ రావలసినదే. ఏ మాత్రము ఆలస్యము చేయరాదు. క్రమశిక్షణతో ఆయా పనులు నెరవేర్చవలెనని శ్రీవారి ఆదేశము.

ఒకనాడు రాత్రి కుంభవర్షము కురియుచుండెను, మా కుటీరము (గుహాశ్రమము) ఆశ్రమ మూలస్థానమునకు ఒకింత దూరముగ నున్నది. దూరముగ నుండుటచే ఆశ్రమములో కొట్టబడు గంటలు మాకు సరిగా వినిపించవు. తెల్లవారి జామున నాలుగు గంటలకు లేచి స్నానాదులను నెరవేర్చుకొనిన గాని గురుమందిరమున జరుగు పారాయణ కార్యక్రమమును అందుకోలేరు. నాయొద్ద గడియారము లేదు. శ్రీవారు తామరకొలనునందు స్నానము చేయుటకు వచ్చునపుడు ఒక చేతి లాంతరు వెంటతీసికొనివచ్చి కొలనుయొద్ద నున్న ఒక స్తంభమునకు తగిలించుదురు. ఆ దీపము మా కుటీరమునకు బాగుగ కనుపించును. అది కనిపించినచో ఉదయము నాలుగు గంటలైనదని మాకు గురుతు. అందుచే ఆ వర్షపురోజు రాత్రి అప్పుడప్పుడు నిద్రలేచి ఆ దీపము ఉన్నదాయని చూచుచుండెడివాడను. ఎందుకనగా ఎంతవాన కురిసినను పారాయణాది కార్యక్రమములకు అంతరాయము కలుగ కూడదు. ఏ మాత్రము ఆలస్యమైనను విధిని ఉల్లంఘించినట్లే కాగలదు. క్రమశిక్షణకు లోపము కలిగినట్లే కాగలదు. ఈ ప్రకారముగ శ్రీవారి సాన్నిధ్యమందు భయభక్తులతో ఆశ్రమ కార్యములను నిర్వహించుచుండెడి వారము. సోమరితనమును, తమోగుణమును, జడ్డకమును, శ్రీవారు ఏకాలమందును అంగీకరించెడి

వారు కాదు. వారి క్రమశిక్షణ పద్ధతులే అంతేవాసులు నిర్దుష్టముగ వారి విధులను నిర్వహించుటకు దోహదమును కలుగజేసినవి.

8. 1942 వ సంవత్సరమున శ్రీవారి అంగీకారమును బడసి ఒక్క సంవత్సర కాలము నేను మౌనవ్రతదీక్ష నవలంబించితిని. ఆ మౌనకాలమున ఒకరోజు పలకపై ఏదియో వ్రాసి మఱియొకరికి చూపించుచుండగా ఆ దృశ్యము శ్రీవారి కంట బడెను. వెంటనే శ్రీవారు నాతో యిట్లు చెప్పిరి -

"మౌనదీక్ష వహించినవారు పలకమీద, కాగితముల మీద వ్రాసి ఇతరులకు చూపించుచుండు పద్ధతి మంచిది కాదు. మౌనము వాక్కునకే కాక మనస్సునకు కూడ ఉండవలెను. వాఙ్మౌనముతో బాటు మానసిక మౌనము కూడ శీలించవలెను. అనగా ఏ విధమైన దృశ్యసంకల్పము మనస్సునందు జొరబడకుండులాగున చూచుచుండవలెను. అట్లు చేయుటయే ఉత్తమమౌనము"—శ్రీవారి ఆ చక్కని ఉద్బోధము భావికాలమున మా కెంతగనో ఉపకరించినది.

9. అనేక ఆధ్యాత్మిక ఉద్గ్రంథములను తెలుగు భాషలోనికి అనువదింపజేసి ఋషుల విజ్ఞానమును సర్వులకు వెదజల్లవలయునని శ్రీ స్వాములవారి ప్రబల ఆకాంక్ష. శ్రీవసిష్ఠ మహర్షి ప్రోక్తమును, శ్రీ వాల్మీకి మహర్షి విరచితమును అగు యోగవాసిష్ఠమను మహోన్నత ఆధ్యాత్మిక గ్రంథము ముప్పదిరెండు వేల శ్లోకములతోగూడి వేదాంత

గ్రంథములలో చూడామణియై విరాజిల్లుచున్నను అది తెలుగు భాషలోనికి అప్పటివఱకు అనువదింపబడలేదు. ఆ గ్రంథముయొక్క మహిమను గుర్తెఱిగిన శ్రీస్వాములవారు దానిని వెంటనే ఆంధ్రీకరింప జేయదలంచి ఆ బృహత్కార్యమును శ్రీ నిర్వికల్పానందస్వాములవారికి, నాకు అప్పగించిరి. వారి ఆజ్ఞను శిరసావహించి వెంటనే మేమా పవిత్ర కార్యమునకు పూనుకొంటిమి. శ్రీ నిర్వికల్పానంద స్వాములవారు పూర్వభాగమును, నేను ఉత్తర భాగమును అనువదించితిమి. ఆ గ్రంథస్థ విషయములు నా కెంతయో ఉత్తేజమును కలుగజేసినవి.

శ్రీ స్వాములవారి దివ్యానుగ్రహముచే అట్టి మహత్తర ఆధ్యాత్మిక వాఙ్మయము యొక్క పరిచయము కలిగి నందులకు ఆంధ్రులెంతయో ఆనందాతిశయము ననుభవించుచున్నారు.

ఈ ప్రకారముగ ఎన్నియో పద్ధతులు, నియమములు, సదాచారములు శ్రీవారి సాన్నిధ్యమున ఉన్న పండ్రెండు సంవత్సరములలో నేర్చుకొంటిని. శ్రీవారి ఆయా బోధలు ప్రతివానికిని జీవితమునందెంతయో సత్ప్రభావమును కలుగజేయును. కనుకనే పెద్దలు గురుకులవాసమునకు ఎంతయో ప్రాముఖ్యత నిచ్చియుండిరి.

★

ఓమ్

శ్రీవారి జీవితముద్వారా నేర్చుకొనదగిన పాఠములు

1. భగవంతుని యెడల పరిపూర్ణ విశ్వాసము కలిగియుండవలెను.
2. ఆధ్యాత్మిక సాధనలందు ప్రబల వైరాగ్యమును చేబట్టవలయును.
3 దృఢతరదీక్షతో, పట్టుదలతో కార్యములను సాధించవలెను. (అవి సాంఘికములైనను, ఆధ్యాత్మికములైనను సరియే).
4. సోమరితనమును దరికి చేర్చరాదు.
5. లక్ష్యమును సాధించుటలో ముందుకు పెట్టిన అడుగు వెనుకకు వేయరాదు.
6. పరప్రాణియెడల దయకలిగి యుండవలెను.
7. బ్రహ్మవిద్యను తాను చక్కగ అభ్యసించి, సాధించి, తన అనుభూతులను ఇతరులకు తెలియజేయుట ద్వారా లోకోపకారమును గావింపవలెను.
8. కష్టసహిష్ణుత కలిగియుండవలెను. సాధనకాలమునగాని, తదుపరిగాని జీవితమున శీతోష్ణ, సుఖదుఃఖ, మానావమానాది ద్వంద్వములను సహించుకొని నిర్వికారుడై, అచంచల, దృఢతరదీక్షతో లక్ష్యప్రాప్తికై ముందునకు సాగిపోవలెను.
9. నిరాడంబరత్వమును, నిరహంభావమును అలవఱచుకొనవలెను.
10. కామక్రోధాది అరిషడ్వర్గమును జయించి, ఇంద్రియ మనంబులపై ప్రయత్నపూర్వకముగ విజయమును సాధింపవలెను.

11. ఉపనిషత్తులు, భగవద్గీత, భారతము, భాగవతము రామాయణము మున్నగు ఉద్గ్రంథములు, శ్రీ శంకరాచార్యాది మహనీయుల రచనలు, బోధలు తాను లెస్సగ పఠించి, వానిని జీవితమున కార్యాన్విత మొనర్చి ఇతరులకు కూడ వానిని అందజేయవలెను.
12. నిత్య ప్రసన్నత, నిర్లిప్తత కలిగియుండవలెను.

★

శ్రీవారి సూక్తులు

1. దయగల హృదయమే భగవన్నిలయము.
2. ముందుకు పెట్టిన అడుగు వెనుకకు పెట్టరాదు.
3. లేని మహిమలు చెప్పుకొనినచో ఉన్న మహిమలు ఊడిపోవుటయే కాక రానున్నవి కూడ రాకపోవును.
4. ప్రాణులకు సేవ చేయుటయే దైవసేవ.
5. పురోభివృద్ధిని గోరువారు పూర్వ వృత్తాంతమును మఱువరాదు.
6. భావశుద్ధియే జ్ఞానసిద్ధి.
7. తినుటకు జీవించువాడు బద్ధుడు, జీవించుటకు తినువాడు ముక్తుడు.
8. సత్యంవద – ధర్మంచర (సత్యమును పలుకుము – ధర్మము నాచరింపుము.)
9. నడపువారుండినచో నడచువారు సిద్ధముగా నుందురు.
10. న శ్రేయో నియమం వినా – నియమపాలన లేనిచో శ్రేయము లేదు.
11 విద్యాతపోభ్యాం భూతాత్మా (విద్యను, తపస్సును ఆర్జించి మనస్సును పవిత్ర మొనర్చుకొనవలెను.

★

ఓమ్.

శ్రీ స్వాములవారి గంభీర ఘోషణము

"దివ్యాత్మ స్వరూపులగు సోదరులారా! సోదరీ జనులారా! తిలకుగారు స్వరాజ్యము మన జన్మహక్కని ఉద్ఘోషించినట్లు, స్వారాజ్యము, దానికి సంబంధించిన సాధనలు, సాధన కనుకూలములగు శాస్త్రములు మనుష్యులందఱి సొంతమని దృఢముగా ఉద్ఘోషింపుడు. ఇట్టి దృఢమగు బోధ కలిగి వర్తింపుడు. అప్పుడే మీరు నిద్రనుండి మేల్కొనిన వారగుదురు.

విజ్ఞాన మూర్తులారా! మాయామోహము నుండి లెండు! అజ్ఞాన నిద్రనుండి మేల్కొనుడు. మీరెల్లరు జ్ఞాన స్వరూపులని మీ నిజావస్థను కనుగొనుడు! ఆనందము నొందుడు. ఉత్తిష్ఠత! జాగృత! ప్రాప్యవరాన్ని బోధత! ఇప్పుడు మనము చేయవలసినది బ్రహ్మవిద్యనభివృద్ధి పఱచుటయే.

మహర్షుల వంశములో పుట్టిన సోదరీ సోదరులారా! మహనీయుల దివ్య జీవితములను స్మరింపుడు! లెండు! మేల్కొనుడు! ప్రకృతికి పరమైన ఆత్మస్థితిని పొందిన వారిని ఆశ్రయించి తత్త్వమును గ్రహింపుడు. ఏలన, కాల చక్రము ఒక్క నిమిషమైన నిలువక తన ప్రయాణము సాగించుచున్నది. దైవాత్మ స్వరూపులారా! దయా మూర్తులారా! పగలు, రాత్రి, దినము, వారము, పక్షము, మాసము, అయనము, సంవత్సరము – అతివేగముగా దాటిపోవుచున్నవి. ఇట్టి తరుణమున ఊరకుండుట పాడియా! జాగరూకులై ఆత్మావలోకన మొనర్చుటకు ప్రయత్నింపుడు! శోక సాగరమును దాటుడు! నిత్య సుఖమును పొందుడు! అమృతమై, శివమైన పదము నధిష్ఠించి సుఖింపుడు!

★

కొందరి ప్రశ్నలకు శ్రీవారి సమాధానములు

★

1. ప్రశ్న :- స్వామీ! మీకు జ్యోతిష్యము తెలుసునా?

శ్రీవారు :- తెలుసు. పూర్వము మీరేది చేసిరో, దానినిపుడనుభవించుచున్నారు. ఇపుడేమి చేయుచున్నారో దాని ఫలితము తదుపరి రాబోవుచున్నది. — ఇదియే నాకు తెలిసిన జ్యోతిష్యము.

2. ప్రశ్న :- స్వామీ! మీ యొద్ద మలయాళ మంత్రములేమైనా ఉన్నవా?

శ్రీవారు :- ఉన్నవి. అవి (1) దృక్కగు ఆత్మలో నిలుకడ కలిగియుండుట, దృశ్యభావన లేకుండుట. (2) పవిత్ర ఆచరణ (3) తపస్సు (4) బ్రహ్మచర్యము (5) ఆత్మవిచారణ (6) అనుష్ఠానము

★

ఓమ్

శ్రీ స్వాములవారి ఉపదేశరత్నములు

★

1. శరీరమునకు ఆహారము కన్న ఆత్మకు ప్రార్థన చాల అవసరము.
2. పుస్తకముతో బాటు మస్తకమును కూడ పరిశోధించవలెను.
3. ఇంద్రియములు బలవత్తరములుగా నున్నపుడు నానిని జయించువాడే ప్రవక్త.
4. దేహమను క్షేత్రములో పరమాత్మను గాంచగలుగు మహాత్ములున్న స్థలమే దివ్యక్షేత్రము.
5. కోపిష్ఠుల అనుష్ఠానములు కళాయి లేని పాత్రలో వండిన పప్పుపులుసు వంటివి (వ్యర్థములు).
6. అనేక శాస్త్రములు చదివి ఏమియు ఆచరింపని వానికంటె ఏమియు చదువక మంచి అనుష్ఠానము కలిగియుండుట మేలు.
7. భుజించిన వెంటనే అనాయాసముగ పనిచేయగల్గుచో అది మితహార మనబడును.
8. విషయవాసనలను పూర్తిగ నిరోధించుటయే బ్రహ్మచర్యము. అయ్యది సర్వశ్రేష్ఠమైనది.
9. కొబ్బరికాయపై పీచుయుండినచో ఎన్నిసార్లు కొట్టినను పగులని చందమున, హృదయము ప్రపంచవాసనలచే,

వృత్తులచే కట్టబడియుండు వఱకు ఎంత ధ్యానించినను హృదయగ్రంథి విచ్ఛేదము కానేరదు.

10. నీటి నుండి బయటపడుచుండు చేప యేలాగున సౌఖ్యము నొందజాలదో, ఆలాగున దైవభావము వీడి కర్తృత్వ బుద్ధి గలిగియుండు జీవునకు నిత్యసౌఖ్యము కలుగజాలదు.

11. తాను నిత్యశుద్ధ చైతన్యస్వరూపుడే కాని, రక్తమాంస మలమూత్రాది యుక్తమగు దేహముకాదను సత్యమును మఱల మఱల జ్ఞాపకము చేసికొనుచుండవలెను.

12. సింహగర్జనమును వినినచో అరణ్యములో గల మృగము లన్నియు ఏలాగున పారిపోవునో, ఆలాగున హృదయా రణ్యములో ఆత్మభావముతో గూడిన ప్రణవోచ్చారణ ముచే దృశ్యవృత్తులు పలాయనము చిత్తగించును.

13. వ్యాధిగలవానికి ముందుగా విరేచనమునకు ఔషధ మిచ్చి తదుపరి రోగమునకు మందిచ్చునట్లు, బ్రహ్మసాక్షా త్కార జ్ఞానమును బోధించుటకు ముందుగా సత్కర్మా నుష్ఠాన సదాచారములను ఉపదేశింపవలెను.

14. బీజము ననుసరించియే ఫలము కలుగును గాని, బీజ మొకటి, ఫలము మఱియొకటి ఎన్నటికిని ఉండజాలదు. అట్లే హృదయములో గల వృత్తి ననుసరించియే జీవునకు ఫలము కలుగుచుండును. ఈ రహస్యమును తెలిసికొని పవిత్రవర్తనముతో జీవించువాడు ధన్యుడగును.

15. అవిద్యను నాశనముచేయు వృత్తియే విద్య. అది కల వారు చదువురానప్పటికిని సర్వశాస్త్ర పారంగతులే యగుదురు. సమస్త విద్యలందారితేరినప్పటికిని ఆత్మ జ్ఞానము లేనివారు నిరక్షరకుక్షులే యగుదురు.

16. మనస్సుచేయు చేష్టలను ఏకాంతముగ కూర్చుండి జాగ్రత్తగ నిరీక్షించుచుండినచో మనోజయము త్వరగా సిద్ధించగలదు.

17. కోపమును కోపించెడు అభ్యాసము గలవారికి కోపము శీఘ్రముగ నశించును. కోపము నశించినచో తక్కిన దుర్గుణములన్నియు తమకు తామే నశించిపోవును.

18. మనస్సను లోహమును వైరాగ్య, ధ్యాన, శాస్త్ర విచారములను సుత్తితోగొట్టి భక్తియను పరమాత్మ ధ్యానములో కరగించిన యప్పుడే బ్రహ్మాకార విగ్రహ ముగ తయారు కాగల్గును.

19. దేహేంద్రియాది సుఖములను పొరలు (ఆవరణములు) ఒక్కొక్కటిగా తెగిపోవుచుండినచో ఆత్మ యొక్క ఆవరణములున్ను ఒక్కొక్కటిగా నశించుచుండును. ఆ ప్రకారముగ సమస్తేంద్రియ సుఖములున్ను నశించి నచో ఆత్మస్వరూపము మాత్రము మిగిలియుండును.

20. దైవకరుణ లేనిచో తనకు తానే ముక్తినొందుట మహా దుర్లభము. అగాధమగు కూపములో పడిపోయినవాడు తనకుతానే పైకి ఎక్క సాధ్యముకాదు. కావున దయా

మయుడగు సర్వేశ్వరుని కరుణకు పాటుపడును!

21. గమ్యస్థానము చేరువరకు ముందుకు పెట్టిన అడుగును వెనుకకు పెట్టని స్వభావముగలవాడు ఈ జన్మములోనే పరమగమ్యమును (పరబ్రహ్మమును) పొందగల్గును.

22. స్వరాజ్యము తన జన్మహక్కు అని చెప్పువారివలె స్వారాజ్యమున్ను (ఆత్మ సామ్రాజ్యమున్ను) తన స్వంత హక్కు అని చెప్పువారు మాత్రమే మోక్షమును బొందగలరు.

23. ప్రకృతి ద్వారము (విషయ వాసనలు మొదలైనవి) యెంతవరకు తెరవబడియుండునో అంతవరకు మోక్ష ద్వారము మూయబడియుండును. ఎప్పుడు ప్రకృతి ద్వారము మూయబడునో అప్పుడు మోక్షద్వారము తెరవబడును.

24. మానవుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు సరిగా నడచుచుండిన యే లాగున జీవితము సుఖముగా జరుగునో, ఆలాగున తన నియమములను సరిగా ఆచరించువాడు ఇహపర సౌఖ్యముల నొందగల్గును.

25. దైవసాక్షాత్కార జ్ఞానము గలుగువరకు తమ కేర్పడిన పని పూర్తి అయినదని తలంచి అజాగ్రత పడగూడదు. (సాధన విడువకూడదు).

26. సోమరితనము మనుజుని క్రిందిస్థితికి, సోహం పరత్వము ఉన్నత స్థితికి తీసికొని వెళ్లును.

7. మనస్సుచేయు చేష్టలను ఏకాంతముగ కూర్చుండి జాగ్రతగ పరీక్షించుచుండినచో మనోజయము త్వరలో సిద్ధించును.

8 విశ్వశాంతిని కోరువానికే ఆత్మశాంతి కలుగును.

9, తాను చేయువలసినపని సరిగా చేయనిచో తనకు రావలసినది సరిగా రాదు.

0. ఐహిక సుఖముపై విరక్తికలుగువానికే ఆత్మసుఖము ప్రాప్తించును.

1. మానవసేవ చేయుటకు ముందుగా మానససేవ చేయవలెను. అపుడే మానవసేవ చక్కగా చేయగలరు.

2. కాలమును వ్యర్థముచేయువాడు కాలునకు వశుడగును.

3. ప్రాణికోట్లకు ఉపకారము చేయుటయు, పరమాత్మను పొందుటయు మనుష్య జన్మయొక్క లక్ష్యము.

4. దీపమునకు, తైలమునకు ఎంత సంబంధముకలదో, బ్రహ్మచర్యమునకు, ఆహారమునకు అంత సంబంధము కలదు.

. కృతజ్ఞత కలవారియెడల సర్వేశ్వరుడు కృపగలిగియుండును. ఒక్కసారి మంచినీళ్లు ఇచ్చినవారికి కనీసము పదిసార్లైనను ఆవుపాలలో చక్కెరకలిపి ఈయవలెనను కృతజ్ఞతా బుద్ధికలిగి యుండవలెను.

. దొరికినదానితో సంతుష్టినొందువాని దగ్గర ఏకచ్ఛత్రాధిపత్య పదవికూడ తలవొగ్గి సిగ్గునొందును.

37. వారి వారి జీవయాత్రచే ఏ ప్రాణికిని క్లేశము కలుగ కుండునట్లు ఆచరించుట పరమధర్మము.

38. అధర్మ మార్గముచే పంచభక్ష్య పరమాన్నములను భుజించుటకంటె ధర్మమార్గములో ఉండి అంబలి, కూటి నీరు త్రాగి జీవించుట శ్రేష్ఠతమము.

39. యుక్తాహారము, వివిక్తవాసము, బ్రహ్మచింతనము అను రత్నత్రయమును జీవితపర్యంతము విడువరాదు.

40. దేహేంద్రియాదుల సుఖములలో ఎంతెంత ఆసక్తుడగు చుండునో అంతంత బద్ధుడగుటయే కాక దైవమునకు దూరస్థుడును అగును.

41. జీవితమంతయు నియమబద్ధమై గడుపవలయునను దృఢ సంకల్పము గలుగుదశనుండియే మానవత్వము ప్రారంభ మగును.

42. ప్రకృతిగుణములైన కామాదులను సంపూర్ణముగ జయించుటయే ఆత్మసామ్రాజ్యమును పొందుటయగును.

43. జనులందఱిని వొప్పించి నీవే కార్యమును చేయజాలవు. కావున సత్యమునుండి చలింపక నీ యనుష్ఠానమును నిర్విఘ్నముగ సలుపుము.

44. అగాధనిష్ఠలో ప్రవేశించవలెనని అఖండజ్ఞానమును పొందవలయును.

45. పరమశాంతితో జీవించవలెనని అశాశ్వతమును విడువ వలయును.

46. దైవప్రేమ కావలయునని లోకమును ప్రేమించ వలయును.

47. చేసినతప్పుకు సరియైనశిక్ష విధించుకొని మరల తప్పు చేయ కుండునట్లు సంస్కరించుకొనుట ఉత్తమలక్షణము.

48. తనలోగల దోషములను ఇతరులలోగల సుగుణములను చెప్పువాడు ఉత్తముడు.

49. అంతఃకరణమను అద్దమును దృశ్యమువైపునకు త్రిప్పి నచో, దృశ్యమే అగుపడును గాని తన స్వరూపమైన ఆత్మ కనుపించ నేరదు.

50. భగవంతునిపై భక్తికలిగినవారు చాలామంది ఉండ వచ్చునుగాని, భగవంతుని దయను సంపాదించినవారు అరుదుగా నుందురు.

51. ఏకాంతమనగా మనుష్యులెవ్వరును లేనిచోటని కాదు. ఏ సంకల్పములు లేనిచోట ఉండుట అని అర్థము.

52. శాంతముతోను, ప్రీతితోను మాట్లాడుడు. ఇది అమృ తమునకంటె ఎక్కువ సారమైనది.

53. ఒకరిలోగల మంచి గుణములను చూచునది జ్ఞానదృష్టి. చెడుగుణములను చూచునది అజ్ఞానదృష్టి, దైవమును చూచునది విజ్ఞానదృష్టి.

54. విజ్ఞానము వికసించి రాగా రాగా మానవుడు దైవత్వము నొందును. విజ్ఞానము క్షీణించుచూ పోగా పోగా ఆ మానవుడే మృగత్వము నొందును.

55. ఇంద్రియములకు వశపడినచో పశుత్వము, ఇంద్రియములు వశపడినచో ఈశ్వరత్వము జీవుడు పొందును.

56. దృశ్యవిషయసుఖమునకై పరుగిడు మనస్సు దృక్కగు ఆత్మలో లయించి శాశ్వతసుఖము పొందజాలదు.

57. నిర్మలమైన దైవభక్తియు, ప్రాణికోట్ల సేవయు ఇహపర సౌఖ్యములకు మార్గములు.

58. ఎంతకెంతకు బుద్ధి ప్రాకృతగుణముల నుండి ఉపరతి నొందుచుండునో, దైవభావము లోనికి ప్రవేశింపగలుగునో, అంతకంతకు అది నిర్మలమై జ్ఞానమును, దైవరహస్యమును అధికముగా తెలియ సమర్థమగును.

59. తపస్సను జ్ఞానాగ్నిచే వాసనలను దహింపజేసిన మాత్రమే జన్మరాహిత్యము కలుగును.

60. మనస్సు అతినిర్మలమై ఇతరచింతలెవ్వియు లేనిస్థితిలో మాత్రమే ఆత్మదర్శనము కలుగును.

61. జీవితమందు దైవప్రార్థన, ధ్యాన, జపాదులకు అనుకూల్యమేర్పఱచుకొనుటయే మానవజన్మ మెత్తిన వారందఱి ముఖ్యకర్తవ్యము.

62. కోపమును కోపించెడు అభ్యాసము కలవారికి కోపము శీఘ్రముగ నశించును.

63. ఒక నిమిషమైనను భగవంతుని స్మరింపక వ్యర్థమై పోవునపుడు ఎవని నేత్రముల నుండి ధారధారగా నీరు ప్రవహించునో అట్టి పుణ్యాత్ముడే మానవజన్మయొక్క

మహిమను తెలిసినవాడు. తక్కినవారి జన్మము భూమికి భారమే యగును.

64. మీరు నిత్య శుద్ధ చైతన్య స్వయంప్రకాశులను బోధ గలిగియుండు వఱకు ఎంత అశుచితో కూడిన శరీరముండినను మీరు పరిశుద్ధులు.

65. నిర్మలమైన దైవభక్తియు, ప్రాణికోట్లసేవయు, ఇహపర సౌఖ్యములకు మార్గములై యున్నవి.

66. అందఱికంటె తాను తక్కువవాడని తలంచువాడు అందరికంటె గొప్పవాడగును. అందఱికంటె తాను గొప్పవాడని తలంచువాడు అందఱికంటె తక్కువవాడే యగును.

67. ఒక్క ప్రాణికైనను క్లేశము కలుగకుండునట్లు వారి వారి జీవనయాత్ర సాగించుట పరమ ధర్మము.

68. నీళ్ళచే నిప్పును చల్లార్చునట్లు, శాంతముచే కోపమును, సత్యముచే అసత్యమును, ధర్మముచే అధర్మమును, శ్రద్ధచే సోమరితనమును జయించవలెను.

69. ఆహార శుద్ధి, బ్రహ్మచర్యము, ప్రాణాయామాదులచే స్థూల దేహమును, దైవ భక్తి, ప్రణవాది మంత్ర జపము, మనోనిగ్రహాదులచే మనోమయ దేహమును శుద్ధపఱచుకొనిన వారికి మాత్రమే జ్ఞానోదయము కలుగును.

70. ప్రపంచ సుఖమును మించిన ఆత్మసుఖ మొకటి కలదని మఱువరాదు. దానియందు మాత్రమే శోక శాంతి కలదు.

71. మనుజుడు మృగావస్థ యందున్నపుడు ఏ జీవిని ప్రేమించడు. మనుష్యావస్థకు వచ్చునపుడు బంధువులను మాత్రము ప్రేమించును. దేవతావస్థనందుకొన్నపుడు జీవరాసులన్నిటిని ప్రేమించును. ఈశ్వరావస్థకు వచ్చునపుడు చెట్లనుకూడ ప్రేమించును.

72. బాహ్యాచారము లెన్నియున్నను ఇంద్రియ నిగ్రహము, అంతఃకరణ శుద్ధి లేనిచో ఈశ్వర సాక్షాత్కార జ్ఞానము సిద్ధించదు.

73. గురువుపై విశ్వాసము గలిగి, వారు చూపిన పవిత్ర మార్గమున నడచుచు, సదాచరణ గలిగియుండుటయే గురుసేవ.

★

శ్రీ స్వాములవారి ఉపమానాత్మక బోధ

[నిగూఢములైన వేదాంతతత్త్వములను, ఆధ్యాత్మిక రహస్యములను చిన్న చిన్న దృష్టాంతములద్వారా, ఉపమానములద్వారా శ్రీ స్వాములవారు జనులకు బోధించుచుందురు. దానిచే అగాధమైన పరమార్థతత్త్వము జనసామాన్యమునకు సులభముగ బోధపడును. అట్టి బోధలు కొన్ని ఇచట పేర్కొనబడుచున్నవి —]

1. ప్రమిదె, తైలము, వత్తి, అగ్గిపెట్టె అను ఈ నాలుగు ఉన్నపుడే దీపము వెలుగును. అట్లే వైరాగ్యమను

ప్రమిదె, భక్తి అను తైలము, చిత్తైకాగ్రత అను వత్తి, తత్త్వవిచారణ అను అగ్గిపెట్టె యున్నపుడే జ్ఞానజ్యోతి వెలుగును (ఆత్మానుభూతి కలుగును.)

2. కళాయి లేని పాత్రలో వండిన పప్పుపులుసు చెడిపోవును. అట్లే కోపము మొదలైన దుర్గుణములు కలవారి అనుష్ఠానములు వ్యర్థములై పోవును.

3. చవిటినేలలో చేయబడినకృషి వృథాయగును. అట్లే వైరాగ్యము లేనివారి సాధనలు నిష్ఫలములై పోవును.

4. నిప్పుపుల్లలో అగ్ని నిండియున్నను తడిసినచో మండదు. అట్లే హృదయమందు భగవత్కళ నిండియున్నను విషయ విరక్తి లేనిచో ఆత్మదర్శనము కలుగదు.

5. విషము సోకినవానికి స్మృతిపోవును. అట్లే విషయ సంసర్గము కలవానికి స్వబోధము నశించును.

6. వస్త్రములోని మురికిని పోగొట్టక రంగు అద్దినచో ఆ రంగు నిలువదు. అట్లే నిర్విషయస్థితి నొందనివారి బ్రహ్మవిచారము స్థిరముగ నుండజాలదు. మురికిని పోగొట్టిన వస్త్రమునందు రంగునిలుచునట్లు పుణ్యకర్మానుష్ఠానముచే, భక్తివైరాగ్యాదులచే అంతఃకరణశుద్ధి కలుగ జేసికొనిన వారికి బ్రహ్మవిచారము చక్కగ నిలుచును.

7. నీళ్ళచే నిప్పును చల్లార్చునట్లు శాంతముచే కోపమును జయించవలెను.

8. ప్రకాశముచే చీకటిని పోగొట్టులాగున కరుణచే కాఠిన్యమును, త్యాగముచే లోభమును, వైరాగ్యముచే రాగమును, దయచే భేదబుద్ధిని పోగొట్టుకొనవలెను.

9. పాతలోహ విగ్రహమును క్రొత్త విగ్రహముగా తయారు చేయవలెనన్న, సుత్తితో కొట్టి ముక్కలుచేసి, నిప్పుతో కరగబెట్టునట్లు అజ్ఞానముతో కూడిన మనస్సును వైరాగ్య ధ్యానశాస్త్ర విచారణములను సుత్తితో కొట్టి భక్తిలో కరగవేసినపుడు మాత్రమే జ్ఞానాకారముగ పరిణితమగును.

10. బావిలో పడినవాడు స్వయముగ పైకి ఎక్క సాధ్యపడనట్లును, బంధింపబడినవాడు తనకుతానే బంధచ్ఛేదనము కావించుకొనజాలనట్లును, స్వప్రయత్న మాత్రముచే భవబంధ విముక్తి కానేరదు. దైవకరుణ కూడ వుండవలెను. కావున దయామయుడగు సర్వేశ్వరుని కరుణకు పాటుపడవలెను.

11. సత్తువైన భూమిలో మంచి విత్తనములు వేసినను, వర్షము లేనిచో ఫలించనట్లు, శుద్ధహృదయములో జప ధ్యాన వ్రతాదు లాచరించినను భగవత్కరుణ అను వర్షము లేనిచో జ్ఞానఫలము ఫలించదు. కావున భక్తియే ముక్తికి ముఖ్యసాధనము.

12. నిప్పు మంటచేయువాడు మొదట చిన్నచిన్న కట్టెలను వేయవలెను. మొదటనే పెద్ద కట్టెలు వేయగూడదు. అట్లే బ్రహ్మజ్ఞానాగ్ని ప్రజ్వలించుటకు మొదట పుణ్య

కర్మానుష్ఠానమును నిష్కామముగా శ్రద్ధతో చేయుట, గురుభక్తి, దైవభక్తి కలిగియుండుట మొదలైనవి అనుష్ఠించిన పిదపయే వేదాంతవిచారణ గావించవలెను. లేనిచో స్వరూపజ్ఞానము కలుగుట దుస్తరము.

13. రాత్రి నక్షత్రములు కనుపించినను, పగలు సూర్యుడుదయించగనే మాయమైపోవును. అట్లే అజ్ఞానదశయందున్న వారికి విషయ వృత్తులుండునేగాని ప్రబోధజ్ఞానము ఉదయించినపుడు ఉండవు.

14. ఉదయము మనుజుని నీడ చాల పొడుగుగా కనుపించును. కాని సూర్యుడు పైకిలేచిన కొలది నీడ తగ్గి తగ్గి సరిగా మధ్యాహ్న సమయమున లయించిపోవును. అట్లే మనస్సు అజ్ఞాన స్థితియందున్నపుడు మాయ అపారముగ కనుపించును. ఆత్మ విచారణాదులచే మనస్సు ఎంతకెంతకు ఊర్ధ్వగామియగునో అంతకంతకు ప్రకృతి క్షయించును. పూర్ణప్రబోధస్థితిలో ఆత్మకన్యముగ ప్రపంచము కనుపించదు.

15. సముద్రముయొక్క పైభాగమున సంచరించు చేపలు అలలచే నిశ్చలత్వము నొందక క్రిందకు పైకి పోవుచుండును. సముద్రపు అడుగున అగాధజలములో ఉండుచేపలు నిశ్చలముగా నుండును. అట్లే దేహేంద్రియాది దృశ్య జగత్తునందు ప్రవర్తించువారు సుఖదుఃఖాది ద్వంద్వములచే తల్లడిల్లుచుందురు. కాని దృక్స్వరూపమగు ఆత్మలో రమించువారు పరమశాంతిని పొందుచుందురు.

16. సముద్రమందలి ముత్యపు చిప్పలోని పురుగు నోరు తెరచుకొని స్వాతి కార్తిక వర్షబిందువుకై సముద్రోపరి భాగమున ఎట్లు నిరీక్షించుచుండునో, అట్లే ఎవనిమనస్సు సంసారసాగరమున సర్వేశ్వర కరుణామృత పానమునకై నిరీక్షించుచుండునో అట్టివాడే పరమభక్తుడు. ముత్తెపు చిప్పలోని పురుగు గ్రహించిన జలము ముత్యముగా మారునట్లు, అత్తఱి మనుజునియందలి భక్తి దైవానుభూతియను ముత్యముగా మారుచున్నది.

17. రైలుఇంజనుకు అమర్చబడియుండు సర్చిలైటు దూరపు వస్తువులను ప్రకాశింపజేయునేకాని దాని వెనుకభాగమున నున్న సమీపవస్తువులను ప్రకాశింపజేయజాలదు. అట్లే ప్రపంచబుద్ధి కలవాడెంత పండితుడైనను దృశ్యమును తెలిసికొనగలడే కాని దృక్కగు ఆత్మను దర్శింపజాలడు.

18. పెరుగును చిలకగా చిలకగా వెన్న ఆవిర్భవించును. అట్లే హృదయగుహయందు ప్రతిదినము ఏకాగ్రచిత్తుడై బ్రహ్మధ్యానము చేయుచు రాగా రాగా పరమాత్మ ప్రత్యక్షమగును.

19. శిల్పి ఒక రాతిని తీసికొని ఉలిదెబ్బలు, సుత్తిదెబ్బలు కొట్టి విగ్రహమును తయారుచేయును. అట్లే గురువు శిష్యుని క్రమశిక్షణద్వారా దృశ్యవృత్తులన్నింటిని తొలగించి ఆత్మజ్ఞానిగ చేయును. శిక్షలకు ఓర్వలేనివాడు అట్టి ఉన్నతస్థితిని బడయజాలడు.

20. వెయ్యి రూపాయలనోటుపైగల ముద్రకే విలువకలదు కాని ఆ కాగితమునకు కాదు. అట్లే జనుల జాతి మత కులాదులను కాదు భక్తులు చూడవలసినది. వారి హృదయములో వెలుగుచుండు పరమాత్మను. ఆ దైవమునకే విలువకలదు గాని జాతి కులాదులకు కాదు.

21. దేహమందు వ్రణముండినచో జాతి కులభేదములేక అందఱికిని బాధ ఒకేవిధముగా నుండును. అట్లే హృదయమున దుష్టగుణములు కలవారందఱును దుఃఖము ననుభవించియే తీరవలెను, ఔషధములచే వ్యాధి తొలగిపోయినచో వారు సుఖించునట్లు, నిర్వృత్తిఁ బొందిన మనుజుడు ఆనందామృతములో ఓలలాడుచుండును.

22. రైలుఇంజను వేగముగ పోవుచున్నను, స్టీమ్ తగ్గినచో ఆగిపోవును. మరల స్టీమ్ ఎక్కించిన వేగముగాపోవును. అట్లే అధ్యాత్మ మార్గమున పయనించు సాధకునకు అనుష్ఠానము తగ్గినచో పురోగమనము ఉండదు. మరల ప్రయత్నపూర్వకముగ అనుష్ఠానము చక్కగ చేయుచో, తీవ్రవైరాగ్యమవలంబించినచో గమ్యస్థానము చేరగలడు.

23. షరాబు మలినబంగారమును ద్రావకములో పెట్టిగాని, పుటము వేసిగాని శుద్ధపఱచును. అట్లే నిర్విషయ స్థితి కలుగువఱకు మనుజుడు మనన నిదిధ్యాసనములతోను, ధారణ ధ్యానాదులతోను తీవ్రతర అనుష్ఠానము చేయుచుండవలెను.

24. కుండకు ఒక్క రంధ్రము ఉండినచో అందలి నీరంతయు కారిపోవును. ఇక పదిరంధ్రములున్నచో చెప్పవలయునా! అట్లే ఒక ఇంద్రియము వశపడనిచో జ్ఞానము నశించుచుండ ఇక పది ఇంద్రియములు వశపడనిచో అభ్యాసియొక్క జ్ఞానము ఎంత త్వరలో నశించునో ఊహించుకొనవచ్చును.

25. ఒకే జలము ముత్తెపుచిప్పలో పడి ముత్యమగుచున్నది. శుద్ధస్థలములో పడి స్నానపానాదులకుపయోగించుచున్నది. మరి భూమియందు పడి వ్యర్థమై పోవుచున్నది, అట్లే ఒకే గురుబోధ జిజ్ఞాసువులలో పడి జ్ఞానరత్నముగను, సామాన్యులలో పడి ధర్మాత్ములుగను, విషయాసక్తులలో పడి వ్యర్థముగను అగుచున్నది.

26. పాలుత్రాగు దూడను పట్టి లాగినను కదలిరాదు. అట్లే దైవామృతమును పానముచేయు మనస్సు బహిర్ముఖముగ వచ్చుటకు ఇష్టపడదు. ఇట్టివారికి మోక్షము కరతలామలకము.

27. కాయ బాగుగ పండినపుడు అది మెత్తబడి దానినుండి మధుర రసము కారుచుండును. అట్లే ఎవనికి దైవవిషయములో ఆనంద బాష్పములు రాలుచుండునో, ఎవడు ప్రాణికోట్ల యెడల కరుణ, మృదుస్వభావము కలిగియుండునో అతని ఆత్మపరిపక్వ స్థితిని బొందినదని గ్రహించవలెను.

28. సముద్రజలము నుండి ఒడ్డుకు చేరిన చేపలు తిరిగి ఆ జలములోనికి పోవుటకు తహతహలాడుచుండును. అట్లే భగవంతునిలో చేరుటకు తీవ్రతర మనోవృత్తి కలిగియుండుటయే దృఢతర భక్తి, తీవ్ర వైరాగ్యము అని గ్రహించవలెను.

29. విషముయొక్క సంపర్కముకలవానికి క్రమముగ స్మృతి తప్పిపోవును. అట్లే విషయ సంసర్గము కలవారికి స్వబోధము నశించును.

30. ఒకరు నడచిపోవునపుడు వారి నీడను ఎవరును ఆపలేరు. అట్లే దైవము ఒకరికొఱకు ఏర్పఱచియుండు భాగ్యము ఎవరిచేతను అపహరింప తరముకాదు,

31. సేవకుడు తన సంపూర్ణ రక్షకత్వమును యజమానికి వదలునపుడు అతనియొక్క సమస్త విషయములు యజమానియే చక్కగ చూచుచుండును. అట్లే జీవితమును సంపూర్ణముగ దైవార్పితము చేయువానికి సంపూర్ణ సౌఖ్యము కలుగును. అట్టివాడే పరమభక్తుడు, గొప్ప జ్ఞాని.

32. బల్బు విద్యుచ్ఛక్తి యంత్రముతో ఐక్యపఱచినపుడు మాత్రమే వెలుగును. ఎవరికైనను వెలుగును. అట్లే ఎవని మనస్సు దైవముతో ఐక్యమగునో, అట్టివానికి దైవ జ్ఞానము అనర్గళముగా గలుగుచుండును. చదువుకొనినవారికిని, చదువులేనివారికిని, స్త్రీలకు గూడ కలుగుచుండును.

33. కాకులు అరచుచుండును. కాని హంసలు ఆ ప్రకారము అరవవు. అట్లే మహాత్ములు వాఙ్నియమము గలిగి యుందురు.

34. కంటకాది వృక్షముల మధ్య మంచిచెట్టు వృద్ధికి రాదు. ఆ పిచ్చిచెట్లన్నిటిని పెరికివేసిన మాత్రమే అది వృద్ధి నొందును. అట్లే హృదయమున దృశ్యవృత్తు లుండినచో, ఆత్మజ్ఞానము సరిగా అభివృద్ధి కాదు. వృత్తిరాహిత్యముచే సత్వరము జ్ఞానాభివృద్ధి కలుగును.

35. అగ్ని రగుల్కొనినపుడు కట్టెలు ధ్వంసమైపోవును. అట్లే హృదయమున ఆత్మప్రబోధము కలిగినపుడు కర్మకట్టెలు దృశ్యవృత్తులు, దేహాత్మ భావము నశించిపోవును.

36. ఫిరంగియందు గుండులేక మందు మాత్రము వేసి కాల్చినచో లక్ష్యమును భేదింపదు. అట్లే తాను చేయు భజన, ధ్యాన, జప, కీర్తన, పారాయణాదులు దైవ భావముతో కలవనిచో గొప్ప ఫలమును కలుగజేయ జాలవు.

37. కొబ్బరికాయపై పీచుయుండినచో ఎన్నిసార్లు కొట్టినను కాయ పగులదు. అట్లే హృదయము ప్రపంచవాసనలచే కట్టబడియుండునపుడు ఎంతధ్యానించినను హృదయగ్రన్థి విచ్ఛేదనము కాదు. ఆత్మ విముక్తి నొందజాలదు,

38. నదికి ఆనకట్ట కట్టినచో ఆ నీరు పొలములకు ప్రవహించి క్షేత్రమును సశ్యశ్యామల మొనర్చును. ఆనకట్ట లేనిచో

నదీ జలమంతయు సముద్రములో పడిపోవును. అట్లే ఇంద్రియ నిగ్రహముగలవారు నిత్యమగు ఆత్మసుఖమును పొందుచున్నారు. ఇంద్రియ నిగ్రహము లేనివారు దైవ సౌఖ్యము నొందజాలక సంసారసాగరములో పడిపోవుచున్నారు.

39. నిప్పు మంట వేయునపుడు మొదట పొగ కనిపించినను విసరుచురాగా అదిపోయి ప్రకాశము, మంట ఆవిర్భవించును. అట్లే మనుజుడు అధ్యాత్మ ధ్యాననిరతుడగునపుడు దుఃఖములు, బాధలు ఒకవేళ కలిగినను సాధన విడువకుండ చేసినచో తరువాత ఆత్మ జ్యోతియొక్క అనుభూతికలిగి సుఖించుదురు.

40. దేవాసురులు క్షీరసాగరమును మథించినపుడు విషము జనించినను, తరువాత అమూల్యములగు వస్తువులు, అమృతము ఆవిర్భవింప దేవతలు దానిని త్రాగి అమరులైరి. అట్లే హృదయమున దైవాసురగుణముల పోరు, ఆత్మమథనము కలుగునపుడు మొదట బాధలు కలుగవచ్చును. కాని తుదకు దైవామృతమును అనుభవించి నిత్యతృప్తులగుదురు. క్షీరసాగరమున ఆవిర్భవించిన విషమును ఈశ్వరుడు త్రాగివేసినట్లు భక్తికలవారి కష్టములన్నిటిని జగదీశ్వరుడు శమింపజేయును. కావున బ్రహ్మనిష్ఠులకు భక్తితప్పక ఉండవలెను.

41. వర్షాకాలమున మట్టిగోడను నెమ్మదిగా కట్టవలెను. త్వరగా కట్టినచో కూలిపోవును. అట్లే మోక్షసాధనను

నిదానముగా చేసికొనుచూ పోవలెను. త్వరపడరాదు.

42. జలము నిర్మలముగను, నిశ్చలముగను ఉండునపుడు సూర్యప్రతిబింబము చక్కగా గోచరించును. అట్లే ధ్యాననిష్ఠచేయుచు రాగా మనస్సు నిర్మలముగను నిశ్చలముగనునున్నపుడు అంతరాత్మ స్వయముగ గోచరించును.

43. గుమ్మడిచెట్టు పెట్టిన స్థలములో కాయక దూరముగపోయి కాచును. అట్లే మహాత్ములు తాము పుట్టిన కుటుంబమువారి కంటె ఇతరులకే ఎక్కువ లాభము కలుగజేయుదురు.

44. పచ్చిసొరకాయలో జలాంశము ఉండును. కాబట్టి అది నీటిలో మునిగిపోవును. ఎండిన దానిలో జలాంశము ఉండదు. కాబట్టి అది నీటలోమునుగదు. అట్లే హృదయములో విషయవాసన లుండునంత వరకు సంసార సాగరమున జీవుడు మునిగిపోవును. అవి పోయినచో సంసారమున మునుగడు. దానిని తరించును.

45. తామరపుష్పములను ఆశించి ఏనుగు సరస్సులో దిగి బురదలో చిక్కుకొనిపోవును. అట్లే దృశ్యవస్తువులచే ఆసక్తులగువారు మాయామోహమున పడి నశించుదురు.

46, సరస్సులోని జలము నిర్మలత్వము నొందునపుడు జలాంతర్భాగమందు గల పదార్థములు చక్కగ గోచరించునట్లు అంతఃకరణము శుద్ధమగునపుడు దైవీరచనాశక్తి. ఈశ్వర మహిమ గోచరించును.

47. గ్యాస్ లైటు వెలుగుటకు గాలి, కిరసనాయిల్ రెండిటిని ఎక్కించవలెను. అట్లే బ్రహ్మాత్మైక్యబోధము నిరావరణముగా వెలుగుటకు వేదాంత విచారణ, ఆత్మధ్యానము రెండును ఉండవలయును.

48. రైలుఇంజను నిప్పు, నీళ్లు అను రెండిటివలన నడచును. అట్లే విషయవిరక్తి అను నిప్పు, భక్తి అను నీరు రెండును ఉన్నపుడే జీవునకు మోక్షమార్గమున ప్రయాణము చక్కగ సిద్ధించును.

49. ఏ బీజమైనను పొట్టుతో ఉండునపుడు మాత్రమే నేలలో పెట్టిన మొలచును. పొట్టు ఊడినచో మొలవదు. అట్లే మాయ, అజ్ఞానము అను ఆవరణము ఉండువఱకు మాత్రమే జన్మ ఉండును. అది వదలిపోయిన మరల జన్మ ఉండదు.

50 ఒకడు డాక్టరు పరీక్షకు చదువునపుడు ఏకాకియై చదువును. పరీక్షలో ఉత్తీర్ణుడైన పిదప జనులుండు ఆసుపత్రిని ఏర్పాటుచేసి వారితో మెలగుచుండును. అట్లే భవరోగ వైద్య పరీక్షకై యత్నించు బ్రహ్మనిష్ఠుడు ఏకాంత స్థలములో సాధనలను చేయుచు, మాయనశించి, మనశ్శాంతి కలిగినపిమ్మట బ్రహ్మనిష్ఠులకు కావలసిన ఉపయోగ కార్యములను చేయుచుండును.

51, ఒకడు ప్రభువుయెడల ప్రేమగలిగి ప్రభుశాసనమును, ఆజ్ఞను ప్రేమించుటలేదు. మఱియొకడు ప్రభుశాసనమునే

ఎక్కువగ ప్రేమించుచున్నాడు. అట్లే ఒకడు దైవమును గాని, గురువునుగాని ప్రేమించుచు దైవాజ్ఞను, గుర్వాజ్ఞను ఎక్కువగా ప్రేమించుటలేదు. ఇంకొకడు దైవమును గాని, గురువునుగాని ఎక్కువగా ప్రేమించునట్లు నటించుట లేదు. కాని దైవాజ్ఞను, గుర్వాజ్ఞను చక్కగ పాలించు చున్నాడు, వీరిలో ఎవడు గొప్పవాడు. ఇదియే సామాన్య భక్తియొక్కయు, అంతరంగ భక్తియొక్కయు గురుతుగా నుండును.

52. దీపము వెలుగుచుండు ఇంటిలో దొంగలు ప్రవేశింపరు. అట్లే ఎవని హృదయములో దైవభావము వెలుగు చుండునో, ఆత్మవిచారణ జరుగుచుండునో అచట దృశ్య వృత్తు లెవ్వియును ప్రవేశింపజాలవు.

53. వస్తువు కంటె పాత్ర పెద్దదిగా నుండవలెను. అట్లే అనంతమైన దైవమును హృదయములో అవగాహనము చేయ తలంచువారి హృదయము కూడ విశాలముగ నుండవలెను.

54. పోస్టాఫీసు సేవింగ్స్ బ్యాంకులో డబ్బుకట్టి దేశాంతరము వెళ్ళువారికి కావలసిన ధనము ఆయా చోట్ల పోస్టాఫీసులో లభించును. అట్లే దైవకృప, గురుకరుణ, భూతదయ, పుణ్యకర్మానుష్ఠానము అను సుకృతములను ఆర్జించిన వారికి మాత్రమే అన్నివిధములలోను సౌకర్యము సమకూడి తపస్సు నిర్విఘ్నముగా సిద్ధించును. అవి లేనివారికి అనుకూలము కలుగక విఘ్నములు కలుగుచుండును.

55. అప్పుతీర్చదలంచువాడు, క్రొత్తగా అప్పుచేయక పాత అప్పు కొద్దికొద్దిగా తీర్చుచురావలెను. అట్లే సాధకుడు హృదయములో గల పాతవృత్తులన్నిటిని రహితమొనర్చు కొని క్రొత్తవానిని రానీయక దైవభావములో నుండ వలెను. అపుడు త్వరలో మోక్షసిద్ధి కలుగును.

56. వ్యాపారి రాత్రి అంగడి మూయునపుడు ఆరోజు నందలి ఆదాయ వ్యయములను లెక్కచూచుకొనును. అట్లే సాధకుడు ప్రతిదినము రాత్రి పరుండబోవునపుడు తన యొక్క దిన చర్యను బాగుగ గమనించుచు దుష్టవృత్తు లేవైన వచ్చుచుండినచో వానిని మరుసటి దినము రహితము చేయుచు దైవభావమును అధికము చేయుచు రావలెను. ఈ ప్రకారముగ తన మనోవృత్తులను పరిశీలింపనివానికి అపాయము కలుగవచ్చును.

57. శ్రద్ధ గలిగిన విద్యార్థి పగలు పాఠశాలలోనే కాక, రాత్రికాలమున చాలసేపు చదువుచుండును. అట్లే ఏ ముముక్షువులు తమ బ్రహ్మనిష్ఠను పగలే కాక రాత్రిళ్ళు కూడ అభ్యసించుదురో, అట్టివారు అధ్యాత్మ విద్యలో ఉత్తీర్ణులగుదురు.

58. ఒక యంత్రములో గల శక్తి బహుముఖములుగా పోవు చుండినచో దానియొక్క శక్తి తగ్గిపోవుచుండును. అట్లే మనుజుడు తన మనస్సును ఎంతెంత దృశ్యములో ప్రవేశ పెట్టుచుండునో అంతంత ఆత్మసౌఖ్యము తగ్గిపోవుచుండును.

ఆ మనస్సును దృశ్య విషయముల నుండి విరమించి దైవ ధ్యానములోనికి మరలించినచో కలిగెడు సుఖమనంతము.

59. టపాలు తీసికొనిపోవు రన్నరు ఎచటను నిలువక పరుగెత్తుచునే యుండును. దారిలో ఎచటను కాలమును వ్యర్థము చేయడు. తీవ్ర వైరాగ్యనిష్ఠుడు ఆ ప్రకారముగనే ఎవరితోను మాట్లాడక, కాలమును వృథా చేయక దైవచింతన చేయుచుండును. అట్టివాడు త్వరగా దైవత్వము నొందును.

60. చుక్కాని లేనిపడవ, దారము తెగిన గాలిపటము నిలుకడలేక యుండును. అట్లే స్వరూపస్థితిలో దైవాత్మైకత్వ నిష్ఠలో నిలుకడ బొందని సాధకుడు మనస్సు పోవు మార్గముగా పోయి అశాంతిని, మనోక్షోభను బడయుచుండును.

61. ఇనుమును ఊరక నిప్పులో వేసిన కరగదు. కొలిమి తిత్తితో ఊదిననే కరుగును. అట్లే వైరాగ్యముచే ఏకాంతమున తపస్సు చేయుచుండినను, ఆత్మజ్ఞుల తత్త్వబోధ లేనిచో హృదయగ్రంథి విచ్ఛిన్నము కాదు, మఱియు వారికి సమరస జ్ఞానము కలుగుట దుస్తరము.

62. సిమెంటువస్తువులు ఎండుటకు ముందుగా నీటిచే తడిసినచో చెడిపోవును. ఎండినపిదప నీటిలో ఉండినను కరుగవు. అట్లే జీవన్ముక్తి పరిపక్వదశ కలుగువఱకు సంసార జనమధ్యములో ఉండరాదు. కలిగిన పిదప వారిమధ్యనున్నను చెడడు.

63. శరీరమున వ్రణములు పుట్టినచో దుఃఖము కలుగును. అట్లే హృదయమున దృశ్యవృత్తులు జనించినచో క్షేమము కలుగదని తెలిసికొని వెంటనే వానిని రహితమొనర్చుకొనవలెను. అట్లు చేయనిచో అవి దుఃఖమును కలుగజేయును.

64. కొబ్బరి, బాదము, వరి, గోధుమ మొదలగు బీజమునకు బెరడు, పొట్టు ఉండును. మొదట ఉపయోగములేని పొట్టు మొదలైనవి లేనిచో ఉపయోగముకల బియ్యము మొదలైనవి ఉండజాలవు. పొట్టు మొదలైనవి ఉపయోగము లేనప్పటికిని మొదట ఉండియే తీరవలెను. అట్లే బోధైక స్థితిలో సాధనలు అక్కర లేనప్పటికిన్ని అభ్యాస కాలమున అవి ఉండియే తీరవలెను. అయితే సాధనలచే తృప్తి నొందక సాధ్యపదవిని పొందుటకు కృతనిశ్చయుడు కావలెను.

65. కాలువయొక్క సంకుచితభావము నదిని చేరువరకు ఉండును. నదియొక్క పరిమితత్వము సముద్రమును చేరువరకు ఉండును. పిమ్మట నది అఖండ సముద్రముగా మారును. అట్లే జీవునియొక్క సంకుచిత భావము పరమాత్మను చేరువరకే ఉండును. తదుపరి అఖండ అద్వయ దైవరూపమై విలసిల్లును.

66. అన్ని విద్యలు నేర్చియుండినను నిద్రించువాడు మఱొకనిని నిద్రనుండి లేపలేడు. ఏ విద్యలేని వాడైనను మేలుకొని

యున్నవాడు నిద్రించువానిని లేపగలడు. అట్లే విద్యావంతుడైనను అజ్ఞానము, మోహము కలవాడైనచో ఇతరులకు ఆత్మబోధ చేయుశక్తి ఉండదు. తాను ఫలానివాడని తెలిసికొనుటకున్న సాధ్యపడదు. విద్యలేకున్నను ఆత్మబోధగలవాడు ఇతరులకు ఆత్మ సాక్షాత్కార జ్ఞానము కలుగజేయ సమర్థుడై యుండును.

67. నిచ్చెన ఎక్కువాడు ఒక్కొక్క మెట్టు దాటి పైకి పోవుచుండును. అట్లే తీవ్ర ముముక్షుత్వము కలవాడు ఒక్కొక్క ప్రకృతి గుణమును త్రొక్కివేయుచు అప్రాకృత స్థితిలోనికి అడుగు పెట్టుచుండవలెను.

68. సంగీతము నేర్చుకొనదలంచువాడు కేవలము సంగీత శాస్త్ర పుస్తకమును చదివిన చాలదు. సంగీత విద్వాంసుని యొద్ద నేర్చుకొనవలెను. అట్లే ఆత్మజ్ఞానము కేవలము గ్రంథపఠనముచే లభింపదు. అనుభవజ్ఞానముగల సద్గురువు యొద్ద నేర్చుకొనవలెను.

69. సముద్రములో ఉండు ఓడ అలలకు చలించుచుండును. ఒడ్డునఉన్న ఓడ చలింపదు. అట్లే శోక మోహములు, సుఖదుఃఖములు, స్తుతినిందలు మున్నగు ద్వంద్వములచే చలించుచుండువాడు ఇంకను సంసారసాగరమును తరించినవాడు కాదని తెలిసికొనవలసియుండును. వానిచే చలింపనివాడు ఆత్మజ్ఞానియై, సంసారసాగరమును తరించినవాడై యుండును. ఇదియే ముక్తుని యొక్కయు బద్ధుని యొక్కయు గురుతు.

70. వస్త్రము చినిగినచో వెంటనే కుట్టవలెను. లేనిచో త్వరలో అంతయు చినిగిపోవును. అట్లే మనస్సు వస్త్రము వంటిది. మనస్సులో ఏదియైన ప్రపంచవృత్తి కలిగినచో దానిని వెంటనే పరివర్తనము చేసికొనవలెను. లేనిచో దృశ్యవిషయములలో మునిగిపోవచ్చును.

71. వేరు చెడినచో చెట్టు చెడిపోవును. అట్లే వైరాగ్యమను వేరు లేనిచో మోక్షమను వృక్షము పతనమును పొందును.

72. తైలము మలినమైనది యగుచో దీపము సరిగా వెలుగదు. అట్లే ఆహారము సాత్త్వికమైనది కానిచో బ్రహ్మచర్యమును నిలబెట్టుటకు శక్తి చాలదు.

73. తేలు పైన పడినపుడు జనులు దానిని వెంటనే దులుపుకొందురు. అట్లే చెడు సంకల్పములు కలిగినప్పుడు వానిని తత్క్షణమే తొలగించుకొనవలెను.

74. బంగారు పాత్రలో నిమ్మరసము పోసిన చిలుమెక్కదు. రాగిపాత్రలో పోసిన చిలుమెక్కును. అట్లే కామాది వృత్తులు కలవాని హృదయములో జ్ఞానము నిలువదు.

75. రోగి ఔషధమును సేవింపనిచో రోగము శమించనట్లు, భవరోగము కలవాడు పవిత్రమగు ధర్మమును అనుష్ఠించనిచో భవరోగము శమించదు.

76. గాలి వీచనప్పుడు రాళ్ళు, ఎండుటాకులు ఒకే విధముగ పడియుండును. వీచినచో ఎండుటాకులు ఎగిరిపోయి రాళ్ళు

స్థిరముగ నుండును. అట్లే అనుకూల పరిస్థితులలో అందఱు పెద్దలవలె నుందురు. కాని వికటపరిస్థితు లేర్పడినప్పుడు సామాన్యుడు మనశ్శాంతిని గోల్పోవును. స్థితప్రజ్ఞుడు మాత్రము పరిస్థితుల ప్రభావమునకు లోనుగాక సదా ఆనందమగ్నుడై యుండును.

★

ఓమ్.

శ్రీ స్వాములవారి ఆదర్శ గుణగణములు

1. సర్వభూతదయ: —

1. బాల్యకాలమున ఒక వేటగాడు రెండు పక్షులను బంధించి తీసికొనిపోవుచుండ, శ్రీస్వాములవారు వానిని కొనివైచి ఆకసమున విడిచిపెట్టి ఆనందించిరి.
2. మాంసాహార విసర్జనమును ప్రోత్సహించి అనేకులచే మాంసాహారమును వర్జింప జేసిరి.
3. 'చరాచర సుఖాభిలాషి' అని తమపేరు ముందు వ్రాయుచు సమస్త ప్రాణికోట్ల యెడల దయకలిగి యుండుటయే తమ యభీష్టమని వ్యక్తము చేసిరి.
4. పాములు మొదలైన క్రూరజంతువులను కూడ హింసింపక పట్టకారుతో పట్టి దూరముగ వదలివేయు ఏర్పాటు చేసిరి.

5 కేరళదేశమున శ్రీవారు తమ ఆశ్రమమునందు జనుల ఉపయోగార్థము ఒక బావిని త్రవ్వించిరి. ఒక భారవాహినిని ఏర్పాటు చేసిరి.

6. శ్రీ వ్యాసాశ్రమమున పశువులశాలయొద్ద పశువులు దురద తీర్చుకొనుటకుగాను ఒక రాతిని నాటింపించిరి.

7. ఆశ్రమములో భిక్ష జరిగినపుడు పశువులకు పచ్చగడ్డి ప్రత్యేకముగ ఏర్పాటు చేయుదురు.

2 చిన్నకార్యములందు కూడ జాగ్రత, శ్రద్ధ కలిగి యుండుట: —

1. శ్రీ స్వాములవారు తమ చాప తామే చుట్టుకొందురు. తమ చెంబు తామే తోముకొందురు. తమ వస్త్రమును తామే కుట్టుకొందురు.
2. కళ్ళజోడు పెట్టె మూయునపుడు గాని, పుస్తకము మూయునపుడుగాని శబ్దము కలుగకుండ చూడవలెనని చెప్పుదురు.
3. ధరించువస్త్రము నేలకు తగులరాదనియు, ఒకింత పైగా ఉండులాగున ధరించవలెననియు చెప్పుదురు.
4. దీపమును నోటితో ఆర్పకూడదని బోధించుదురు.
5. ఏదైన ముఖ్యవిషయము ఉన్నపుడే కార్డుగాని, ఉత్తరముగాని వ్రాయవలయుననియు, అనవసరముగ కార్డు మొదలైనవి వృథా చేయగూడదనియు చెప్పుదురు.

6. చిన్న తెల్లకాగితపు ముక్కను కూడ పారవేయక శ్రీవారు దానిని భద్రముగా దాచి ఉపయోగించుచుందురు.

3. క్రమశిక్షణ:-

1. బ్రహ్మముహూర్తమున నిద్రలేచుట, గీతా పారాయణాదులను జరుపుట, ధ్యానాదులను శీలించుట, ఆహారాది విషయములందు సంయమమును శీలించుట, మొదలైన నియమములను శ్రీవారు తాము శ్రద్ధగా పాలించుచు ఇతరులచే పాలింపచేయుదురు.

రాయి సుత్తిదెబ్బలు తిని విగ్రహమైనట్లు శిష్యుడు గురు సన్నిధియందు బాగుగా శిక్షణ బడయ వలయునని చెప్పుదురు. సాధకుడు సోమరితనమునకు తిలాంజలి నొసంగి పట్టుదలతో సాధన కొనసాగించవలెనని శ్రీవారు తఱచు బోధించుదురు. ఆశ్రమములో - 'ఇచట సోమరులకు చోటు లేదు' అని వ్రాయబడిన బోర్డును కట్టించుటయే కాక ప్రతి దినము ఆ వాక్యమును ఆశ్రమ విద్యార్థులచే పెద్ద పెట్టున ఘోషింప జేయుదురు.

4. నిరాడంబరత్వము:-

శ్రీవారు ఆడంబరమును ఎన్నడును కోరరు. ఆశ్రమములో శిష్యులకు పెద్ద పెద్ద భవనములను ఏర్పాటుచేసి తాము మాత్రము పూరి పాకలందే నివసలుపుకొను

చుందురు. ఆడంబరముతో గూడిన కార్యములను చేయవలదని బోధించుచుందురు.

5. అకుంఠిత దైవభక్తి:-

శ్రీ స్వాములవారు భగవంతునిపై అపారమైన భక్తి విశ్వాసములు కలిగియుందురు. వారి జీవితమందలి ప్రతి సంఘటనయందును, వారు బోధించు ప్రతి విషయము నందును దైవభక్తి ప్రస్ఫుటమగు చుండును. గురుభక్తి, దైవభక్తి రెండును మానవుని అభ్యున్నతికి ఎంతయో ఆవశ్యకములని శ్రీవారు తఱచు బోధించుచుందురు.

6. నవనీత హృదయము:-

శ్రీ స్వాములవారు దయార్ద్రహృదయులు, ప్రేమ, దయ, కరుణ, వాత్సల్యము వారి ప్రతికార్యమందును లెస్సగ ప్రస్ఫుటమగు చుండును. ఆశ్రమ విద్యార్థులలో ఎవరైన క్రమశిక్షణను పాటించనిచో వారికి ఒకపూట 'నిరాహారశిక్ష' విధించినప్పటికిని కరుణాపూరిత హృదయాంతరంగులగు శ్రీ స్వాములవారు వారిని కొద్దిసేపటికి పిలిపించి తప్పు చేయ వద్దని చెప్పి మరల అన్నము పెట్టించుదురు.

★

పండిత ప్రశంస

శ్రీ స్వాములవారి పవిత్ర జీవితమును, వారి పవిత్రాశయములను సంస్తుతించుచు గొప్ప గొప్ప పండితులెందరో శ్రీవారిని గుఱించి చక్కని రచనలను గావించిరి. మఱియు సంస్కృతమునందును, తెలుగునందును ఎన్నియో శ్లోకములను, పద్యములను వ్రాసిరి. కవిసార్వభౌమ పండిత శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రిగారు శ్రీవారిని గూర్చి రచించిన శ్లోకములను ఇచట ఉల్లేఖించుచున్నాను –

శ్లో॥ ఓమిత్యేకాక్షరం యత్ప్రణవ మభిహితం
బ్రహ్మతత్త్వం సమస్తం,
తద్ధ్యానైకాగ్ర చిత్తస్తదభవదమలం
యస్తపస్తప్తదేహః,
జ్ఞానానంద స్వరూపం ఘనతర కరుణా
సాగరం సర్వగమ్యం
మల్యాళస్వామినం తం మహితగుణయుతం
మన్త్రమూర్తిం భజేఽహమ్॥ 1

ప్రణవస్వరూపమగు బ్రహ్మతత్త్వమును ఏకాగ్రచిత్తముతో ధ్యానించువారును, తపస్తప్తశరీరులును, నిర్మల బ్రహ్మముగ రూపొందినవారును, జ్ఞానానంద స్వరూపులును, మహాకరుణా సముద్రులును, సర్వులచే ఆశ్రయించదగినవారును, మహా సద్గుణయుతులును, మంత్రమూర్తియునగు శ్రీ మలయాళస్వాములవారిని నేను భజించుచున్నాను.

శ్లో॥ బ్రహ్మాంశాత్సంప్రభూతః సదసదపరగో
వ్యాసభట్టారకోఽస్మిన్,
ఆంధ్రే గోగర్భనామ్నో గిరివరవివరా
దద్య భక్తావనార్థమ్।
సజ్జాతః కాశిబుగ్గ ప్రథితమునినుత
క్షేత్రవాసీ పునర్యః,
మల్యాళస్వామినం తం మహిత గుణయుతం
మన్త్ర మూర్తిం భజేఽహమ్॥ 2

బ్రహ్మాంశసంభూతులును, సదసద్విలక్షణులును అగు ఏ వ్యాస భట్టారకులు నేడు భక్తుల సంరక్షణము కొఱకు ఆంధ్ర దేశమున గోగర్భమను ఉత్తమ పర్వత గుహ నుండి ఉద్భవించి కాశీబుగ్గ అను విఖ్యాతిమైన ముని సంస్తూయమాన క్షేత్రమందు నివసించుచున్నారో, అట్టి మహత్తర సద్గుణయుతులును, మంత్ర మూర్తియునగు శ్రీ మలయాళ స్వాములవారిని నేను భజించుచున్నాను.

శ్లో॥ సాధూనాం పాలనాయ ప్రబల దురిత
విధ్వంసనా యాప్సి భూమౌ,
ధర్మాణాం రక్షణాయ ప్రభురఖిల
జగన్నాయకోద్యావిరాసీత్।
బ్రహ్మశ్రీ శంకరార్యః పునరిహ చ యతిం
యం వదన్తీహ సాధుం,
మల్యాళస్వామినం తం మహిత గుణయుతం
మన్త్ర మూర్తిం భజేఽహమ్॥

సాధువులను పాలించుట కొఱకును, మహా పాపములను విధ్వంస మొనర్చుట కొఱకును, ధర్మములను రక్షించుట కొఱకును, సకల జగన్నాయకుడైన పరమేశ్వరుడే ఆంధ్ర భూమి యందిపుడు అవతరించిరనియు, బ్రహ్మశ్రీ శంకరాచార్యులేయనియు, సాధుపుంగవుడగు ఏ యతివర్యుని గూర్చి పలుకుచున్నారో అట్టి మహాసద్గుణ యుతులును, మంత్రమూర్తియు అగు శ్రీ మలయాళస్వాములవారిని నేను భజించుచున్నాను.

శ్లో॥ సన్న్యస్యైహ స్థితానాం గృహధనవనితా
వాహనానాం సుసఙ్గం,
సోఽహం బ్రహ్మేతి వాచా శ్రుతిషు
కలితయా వ్యాహరన్యోఽర రాజ।
తం సాక్షాచ్ఛంకరం సంయమిజనపరమం
వ్యాసనా మాశ్రమస్థం,
మల్యాళస్వామినం తం మహిత గుణయుతం
మన్త్ర మూర్తిం భజేఽహమ్॥ 4

ఈ ప్రపంచమందలి గృహ, ధన, వనితా, వాహనముల సంగమును లెస్సగత్యజించి, శ్రుత్యుక్తమైన 'సోఽహం బ్రహ్మ' అను వాక్యము నుచ్చరించుచు బ్రహ్మతత్త్వమును పొంది ఎవరు ప్రకాశించిరో అట్టి సాక్షాత్ శంకరస్వరూపులును, సంయమి జనవర్యులును, వ్యాసాశ్రమ నివాసులును, మహా సద్గుణయుక్తులును, మంత్రమూర్తియునగు శ్రీ మలయాళస్వాములవారిని నేను భజించుచున్నాను.

శ్లో॥ అహమస్మి బ్రహ్మ సోఽస్మీత్యను
పదమపరం బ్రహ్మ సాక్షాదభూద్యో
విలసన్మూర్తిర్నతార్తిఘ్నిజపదకమల
ధ్యానసక్తాత్మనామ్।
లలితం విజ్ఞాన తేజోబలకలిత మహం
నిర్మలం నిర్వికారం
మల్యాళస్వామినం తం మహితగుణయుతం
మన్త్రిమూర్తిం భజేఽహమ్। 5

'అహం బ్రహ్మాస్మి' అను మహావాక్యమును సంస్మరించి సాక్షాత్ బ్రహ్మమే అయినవారును, ప్రకాశస్వరూపులును, పాదకమలములను ధ్యానించు భక్తవర్యుల దుఃఖమును హరించువారును, మనోహరులును, విజ్ఞానతేజో విరాజితులును, నిర్మలస్వరూపులును, నిర్వికారులును, మహాసద్గుణయుతులును, మంత్రమూర్తియునగు శ్రీ మలయాళస్వాములవారిని నేను భజించుచున్నాను.

శ్లో॥ శ్రీపాదకృష్ణ కవినా రచితం పరమార్థదమ్।
మల్యాళస్వామినః స్తోత్రం జీయా దాచన్ద్రతారకమ్ ॥6

శ్రీపాదకృష్ణకవిచే రచింపబడినదియు, పరమార్థదాయకమైనదియు అగు శ్రీ మలయాళస్వాములవారి స్తోత్రము ఆచంద్రతారార్కముగ జయించుగాక!

★

ఓం

మృత్యుంజయ మహామంత్రము

ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనమ్
ఉర్వారుక మివ బన్ధనా న్మృత్యో ర్ముక్షీయ మాఽమృతాత్

సుగంధ యుక్తులును, సమస్త జీవులను లెస్సగా పోషించువారును నగు త్రినేత్రుడైన పరమశివుని మేము ఆరాధించుచున్నాము. దోన తీగనుండి దోసకాయను వేరుచేయునట్లు మోక్షప్రాప్తి కొఱకై ఆ పరమాత్మ మమ్ములను మృత్యువు నుండి విడుదల చేయునుగాక!

(ఈ మృత్యుంజయ మంత్రము ప్రాణముల నివ్వ సమర్థమైనది. రోగములు నివారించుటలో, ప్రమాదముల తొలగించుటలో దీనికి పెట్టినది పేరు. ఇది రోగములన్నింటికి వజ్రాయుధము వంటిది. ఇది మృత్యువు జయించు మంత్రము.

ప్రతిదినము భక్తి శ్రద్ధలతో ఈ మంత్రమును కనీసము 108 సార్లు జపించినచో, ఏ విధమైన ప్రమాదములు, అపమృత్యు భయము లేకుండ కాపాడుటయేగాక, దీర్ఘాయువును, శాంతి సౌఖ్యములను ప్రసాదించును.

ఇంతేగాక ఇది మోక్షప్రదమగు మంత్రము కూడా. ఇది పరమశివుని మంత్రము. నిరంతరము జపించువారికి అమరత్వము గూడ ప్రసాదింపగలదు.)

మిత్రులందరికి విన్నపము మేము చేస్తున్న భక్తి ప్రచారం ఈ **WEBSIGHTS** ద్వారా చేస్తున్నాము

http://telugudevotionalswaranjali.blogspot.in
http://gitamakarandam.blogspot.in
http://sundaravignanagrandalayam.blogspot.in
http://hindudevotionalswaranjali.blogspot.in
videos Channel URL:
http://www.youtube.com/ysreddy94hyd
PDF BOOKS Channel URL:
http://www.scribd.com/ysreddy94hyd
COntact E-Mail ID:ysreddy94hyd@gmail.com
our uploade folders links:
MEDIAFIRE:
http://www.mediafire.com/?86epi81waeayl
http://www.mediafire.com/?7900suod857zc
http://www.mediafire.com/?45h5fdfw4lgzl
http://www.mediafire.com/?606gdhk35zvbc
http://www.mediafire.com/?0t92f0wb91g18
http://www.mediafire.com/?xw75pfuld2dyy

4shared.com
http://www.4shared.com/account/dir/7389418/29f7347/sharing.html
http://www.4shared.com/account/dir/17611451/d787ef46/sharing.html
http://www.4shared.com/account/dir/10277723/80937010/sharing.html
http://www.4shared.com/account/dir/8542654/5e21d7f2/sharing.html
http://www.4shared.com/account/dir/13927785/d05881/sharing.html
http://www.4shared.com/account/dir/7389329/5bfa0697/sharing.html
http://www.4shared.com/account/dir/OR3TndOY/sharing.html
http://www.4shared.com/dir/F2rw-Nf_/sharing.html
http://www.4shared.com/account/dir/WNtoWpN7/sharing.html
http://www.4shared.com/account/dir/nxtsJpm4/sharing.html
http://www.4shared.com/dir/gaxNSDyA/sharing.html
http://www.4shared.com/account/dir/OR3TndOY/sharing.html
http://www.4shared.com/dir/F2rw-Nf /sharing.html
http://www.4shared.com/dir/yEUzu0ce/sharing.html
http://www.4shared.com/dir/ntqVRt35/sharing.html
http://www.4shared.com/dir/aEQCrIBZ/sharing.html
please forward the above links to your friends and relatives..